ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 4 డిసెంబరు 2024





రేషన్ దందా..

రూ.32 కోట్లు

ఉచిత బియ్యం.. రూ.32 కోట్లు తెచ్చిపెడుతోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో నెల నెల అక్రమార్కులు, నేతలు, అధికారులు కలిసి రూ.32 కోట్లు తినేస్తున్నారు. పేదల కడుపు నింపాల్సిన బియ్యం అక్రమార్కుల బొక్కసాలను నింపుతోంది. గతంలో రేషన్ అక్రమాలపై గళమెత్తి.. ఇప్పుడు అధికారం చేపట్టిన నేతలు కూడా అదే తీరుగా దందా సాగిస్తున్నారు. అధికారం మారింది.. బియ్యం వ్యాపారులు మారారు. అంతే అక్రమాలు మాత్రం అప్పటిలాగానే కొనసాగుతున్నాయి. ఎండీయూ ఆపరేటర్లు కొందరు కార్డుదారులకు బియ్యం ఇవ్వకుండా నగదు ఇస్తున్నారు. కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యంలో సగానికిపైగా ఇలా తరలిపోతోంది. అధికార పార్టీ నేతలు కొందరు రేషన్ బియ్యం అక్రమ వ్యాపారాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారు. రేషన్ దందాలో అధికార పార్టీ నేతలు భాగస్వామ్యం ఉండటంతో అధికారులు మామూళ్లు పుచ్చుకుని అక్రమాలను పట్టించుకోవడంలేదు. కొన్ని ప్రాంతాల్లో ధైర్యం చేసి తనిఖీలకు వెళ్లినా రేషన్ మాఫియా ఏకంగా అధికారులపైనే దాడులకు దిగుతున్నారు. కాకినాడ పోర్టులో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తనిఖీలు, రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ దందా చర్చ నేపథ్యంలో జిల్లాల్లోని పరిస్థితులు ఇలా ఉన్నాయి.

రెచ్చిపోతున్న బియ్యం మాఫియా

- పాలకులు మారినా ఆగని అక్రమాలు
- రాజకీయ ఒత్తిళ్లతో చేతులెత్తేస్తున్న అధికారులు
- వ్యవస్థలకు సవాల్ విసురుతున్న రేషన్ మాఫియా
- ఇటీవల మంత్రి నాదెండ్ల అక్రమాలు గుర్తించినా అధికారులు మౌనం
- కాకినాడలో ఉపముఖ్యమంత్రి తనిఖీలతో గుజరాత్‌కు తరలిస్తున్న అక్రమార్కులు

925 క్వింటాళ్ల బియ్యం గుర్తింపు

వినుకొండటౌన్: స్థానిక తిమ్మాయపాలెం రోడ్డులోని వెంకటరమణ ట్రేడర్స్ రైస్ మిల్లు, విఠంరాజుపల్లి సమీపంలోని పిచికలపాలేనికి వెళ్ళే రహదారి వద్ద తిరుమల రైస్ మిల్‌లో ఇన్‌చార్జి డీఎస్‌వో నారదమణి, తహసీల్దార్ సురేష్‌నాయక్‌లు మంగళవారం తనిఖీలు చేశారు. వెంకటరమణ రైస్ మిల్లులో తెల్లగోతాల్లో నింపిన 700 క్వింటాళ్ళ బియ్యంతోపాటు రెండు రాసుల బియ్యాన్ని, తిరుమల రైస్‌మిల్లులో 470 బస్తాలను గుర్తించారు. పీడీఎస్ బియ్యం గుర్తించేందుకు వీలు లేకుండా పాలిష్ పట్టినట్లు అధికారులు తేల్చి వాటిని పరీక్ష లకు పంపారు. అయితే మిల్లుల్లో తనిఖీల సమాచారాన్ని అధికారులు గుట్టుగా ఉంచడంపై అనుమానాలకు తావిస్తోంది. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి ఆటోలో రెండు బస్తాల రాగులు, అరు బస్తాల జొన్నలను ఆటోలో పట్టణంలోని మసీదు సెంటర్‌లోని ఓ వ్యాపారి పట్టపగలు తరలించాడు. రాగు లు, జొన్న లు బ్లాక్‌మార్కెట్‌కు తరలింపుపై తహసీల్దార్‌ను వివరణ కోరగా రేషన్‌షాపులను తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.



తిమ్మాయపాలెం రోడ్డులోని వెంకటరమణ రైస్ మిల్లుల్లోని బియ్యాన్ని పరిశీలిస్తున్న సివిల్‌సప్లయ్ అధికారులు



కొమరెపూడి మిల్లులో ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీలు



చుండూరు మండల పరిధిలోని ఓ రైస్‌మిల్లులో రేషన్‌బియ్యం పట్టుకున్న అధికారులు (ఫైల్ ఫొటో)


(బాపట్ల, నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తోన్న బియ్యం పంపిణీని నగదు బదిలీ పథకంగా అక్రమార్కులు మార్చారు. ఎండీయూ వాహనం వద్దే బియ్యం దందా బాహాటంగా సాగుతోంది. పౌరసరఫరాల శాఖ మంత్రి నేతృత్వం వహిస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. బియ్యం కోటాకు బదులుగా కిలోకు రూ.8 నుంచి రూ.12 లెక్క గట్టి మరీ కార్డుదారులకు నగదు ఇస్తున్నారు. రేషన్ కార్డును కాపాడుకునేందుకు కొందరు నెలావారీగా బియ్యం తీసుకుని దళారులకు విక్రయిస్తున్నారు. మరికొందరు ఆ బియ్యాన్ని తినలేక ఎండీయూ ఆపరేటర్ల నుంచే నగదు తీసుకుంటున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని ఒక పట్టు పాలిష్ వేసి, గోతాలు మార్చి జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. కార్డుదారులకు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం నిల్వల్లో సగానికిపైగా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నదనేది బహిరంగ రహస్యం. రేషన్ పంపిణీపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. నెలవారీ తనిఖీలు నిర్వహించడాన్ని కూడా వారు విస్మరించారు. పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల్లో 17,30,810 తెల్లకార్డులు ఉండగా ప్రతీ నెలా 2,55,977 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తున్నారు. వీటిలో 40 నుంచి 50 శాతం బియ్యం నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నట్లు అంచనా. అంటే దాదాపు 1.15 లక్షల క్వింటాళ్ల వరకు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి. టోకు వ్యాపారి కిలో రూ.28 బియ్యం కొనుగోలు చేస్తుండగా ఈ ప్రకారం దాదాపు ప్రతి నెలా రూ.32 కోట్లకు బియ్యం అక్రమ వ్యాపారం జరుగుతున్నట్లు అంచనా. వైసీపీ అధికారంలో ఉండగా బియ్యం బ్లాక్ మార్కెట్ చేసిన వ్యాపారులనే కూటమి నేతలు కొందరు కొనసాగిస్తున్నారు. వైసీపీ పాలనలో పెద్ద ఎత్తున బియ్యం బ్లాక్ మార్కెట్ జరిగింది. అప్పట్లో బియ్యం అక్రమ నిల్వలను ప్రతిపక్ష నేతలు పట్టించారు. బియ్యం అక్రమ వ్యాపారంపై పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. అధికారం మారగానే బియ్యం అక్రమ వ్యాపారం నిరోధిస్తారని

(మిగతా 8లో)

పాలిష్ పట్టి ఎగుమతి

కార్డుదారుల నుంచి కిలో రూ.8 నుంచి రూ.12 వరకు కొనుగోలు చేస్తున్నారు. వీరి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి అక్రమార్కులు రూ.14 నుంచి రూ.16 వరకు కొనుగోలు చేస్తున్నారు. టోకు వ్యాపారి కిలో బియ్యం రూ.28 కొనుగోలు చేస్తున్నాడు. స్టాక్ పాయింట్‌లు ఏర్పాటు చేసుకుని రాత్రి వేళ్లలో బియ్యం సేకరించి ముందుగా ఏర్పాటు చేసుకున్న స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు. కొన్ని చోట్ల మిల్లులను లీజుకు తీసుకుని సేకరించిన బియ్యానికి ఒక పట్టు పాలిష్ వేసి గోతాలు మారుస్తున్నారు. 25.. 50 కేజీల ప్యాకింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. గతంలో కాకినాడ పోర్టుకు బియ్యం నిల్వలు తరలించేవారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాకినాడ పోర్టులో తనిఖీలతో బియ్యం బ్లాక్ మార్కెట్ రూటు మారింది. జిల్లాలో సేకరించిన బియ్యం నిల్వలను ప్రస్తుతం గుజరాత్‌కు తరలిస్తున్నట్లు అక్రమార్కులు బహిరంగంగానే చెబుతున్నారు.



- పునర్నిర్మాణ పనులకు క్యాబినెట్ ఆమోదం
- రూ.11,467 కోట్లు కేటాయింపుతో పనుల పరుగు
- లేఅవుట్ల అభివృద్ధి, భవనాలు, వసతులకు ప్రాధాన్యం
- గ్రామాలను జోన్లుగా విభజించి అభివృద్ధి పనులకు శ్రీకారం
- తొలి విడత పనుల్లో లేఅవుట్లకు అగ్రతాంబూలంపై రైతుల హర్షం

అమరావతికి నవకళ

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో అంధకారంలో చిక్కుకుపోయిన నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతికి నవకళ రాబోతోంది. రాజధాని పునర్నిర్మాణ పనులకు మంగళవారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశం ఆమోదముద్ర వేసింది. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన నిర్మాణ పనులను పునఃప్రారంభించేందుకు రూ.11,467 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలకు సోమవారం సీఆర్డీఏ ఆమోదించగా, మంగళవారం రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. దీంతో ఐదేళ్ల క్రితం ఆగిపోయిన రాజధాని నిర్మాణ పనులు ఇక చకచకా పరుగులు పెట్టనున్నాయి. తొలి విడత పనుల్లో అగ్రతాంబూలం లేఅవుట్లకు ఇవ్వడంపై రైతుల ఆనందానికి అవధులే లేకుండాపోయాయి. ఇప్పటికే తుది దశకు చేరిన గెజిటెడ్ ఉద్యోగుల భవనాలు, క్లాస్- 4 ఉద్యోగుల అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి రూ.594.54 కోట్లు కేటాయించింది. ఆ భవనాల వద్ద తాగునీరు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, వరద నీటి కాల్వలు, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, భవన సంరక్షణ తదితర మౌలిక సదుపాయాల కోసం మరో రూ.226.26 కోట్లు కేటాయించింది. నాన్ గెజిటెడ్ అధికారుల టవర్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు రూ.594.36 కోట్లు కేటాయించారు. ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల నివాసాల కోసం రూ.516.6 కోట్లు కేటాయించారు.

రైతుల లే అవుట్ల అభివృద్ధికి భారీగా..

భూ సమీకరణ విధానంలో భూములిచ్చిన రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్ల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. తొలివిడతగా 8,496.3 ఎకరాల్లో ప్లాట్ల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి, మంచినీటి సరఫరా, వరదనీరు, మురుగునీరు పారుదల, విద్యుత్, ఐటీసీ కేబుళ్లు, రోడ్ల వెంట


(మిగతా 8లో)

సాగు సంఘాల ఎన్నికలు... మళ్లీ వాయిదా

వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగునీటి సంఘాల ఎన్నికలకు ముహూర్తం కుదరడంలేదు. 8న జరగాల్సిన మళ్లీ ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి. వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం ఎన్నికలు వాయిదా వేసినట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ముందస్తు ప్రక్రియ పూర్తయింది. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కూడా పూర్తి చేశారు. అయితే తదుపరి ఉత్తర్వులు విడుదలయ్యే వరకు ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 274 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. వీటి పరిధిలో 2,628 టీసీ(టెరిటోరియల్ కానిస్టెన్సీ)లు ఉన్నాయి. ఒక్కో సంఘం పరిధిలో దాదాపు 12 టీసీలు ఉన్నాయి. తొలుత టీసీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. టీసీలకు ఎన్నికైన వారు నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. నీటి సంఘాలకు కాలువ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నికుంటారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు. 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. డీసీలు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటుంది. 8న నీటి సంఘాలకు, 11న డీసీలకు, 14న ప్రాజెక్టు కమిటీకి జరగాల్సిన ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసింది.



జైలు నుంచి వచ్చి దొంగతనాలు

12 రోజులు.. 8 చోరీలు.. రూ.20 లక్షల సొత్తు చోరీ

ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసిన పోలీసులు

అద్దంకి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో జైలుకు వెళ్లినా తీరు మార్చుకోలేదు. బెయిల్‌పై వచ్చి మరీ చేతులకు పని చెప్పారు. 12 రోజుల్లో 8 చోరీలకు పాల్పడి, రూ.20 లక్షల సొత్తును అపహరించారు. అంబేడ్కర్ కొనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలేనికి చెందిన కరుటూరి సాయి సూర్యతేజ, గుంటూరు స్వర్ణభారత్‌నగర్ 2వ లైన్‌కు చెందిన బెల్లంకొండ విజయ్‌కృష్ణలు జైలులో స్నేహితులుగా మారి చోరీలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో వీరిని అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు చీరాల డీఎస్పీ మొయిన్, బాపట్ల సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్ తెలిపారు. అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు తెలిపారు. తల్లి మరణంతో తండ్రి మరో వివాహం చేసుకోగా కుటుంబానికి దూరంగా ఉంటూ సాయిసూర్యతేజ వ్యసనాలకు, విలాసవంతమైన జీవనానికి అలవాటు పట్టాడు. రాత్రిళ్ల గ్యారేజీ షట్టర్ల పగలగొట్టి దొంగలించిన కార్లలో తిరుగుతూ చోరీలకు పాల్పడి రాజమండ్రి, కుప్పం, చిత్తూరు, గుంటూరు అర్బన్, విజయవాడ జిల్లాలోని జైళ్లలో 2019 నుంచి శిక్షలు అనుభవించాడు. గంజాయి కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న విజయ్ కృష్ణతో సాయి సూర్యతేజకు పరిచయం ఏర్పడగా ఇద్దరూ కలిసి చోరీలకు పాల్పడ్డారు. సాయిసూర్యతేజ నవంబరు 9న కుప్పం జైలు నుంచి విడుదల కాగా గతంలో పరిచయం ఉన్న విజయకృష్ణతో కలిసి 13వ తేదీ నుంచి 25వ తేదీ మధ్య 8 చోరీలకు పాల్పడ్డారు. 13న కోవూరులో కారును దొంగలించి, అదే కారులో వెళ్లి దర్గామిట్టలోని ఓ దుకాణంలో దొంగతనం చేశారు. అనంతరం మంగళగిరి, వినుకొండ, పొదిలి, పర్చూరు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారు. 25న అద్దంకిలోని పోతురాజుగుండి వద్ద శ్రీరామ్ ఏజెన్సీ షట్టర్ పగలగొట్టి రూ.15లక్షల నగదు అపహరించారు. మొత్తం 8 చోట్ల సుమారు 20లక్షల నగదు, రెండు కార్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను సొత్తును దొంగిలించారు. అద్దంకిలో పెద్ద మొత్తంలో నగదు అపహరణకు గురికావడంతో ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మంగళవారం పట్టణ సమీపంలో కొంగపాడు క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు చేస్తుండగా సాయిసూర్యతేజ, విజయ్‌కృష్ణ పట్టుబడ్డారు. వారి నుంచి 12,25,000 నగదు, సోనీ సౌండ్ సిస్టం, టీవీ, 4 సెల్‌ఫోన్లు, రెండు కార్లు, 7 ఇంజన్‌ఆయిల్ డబ్బాలు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థిని చితకబాదిన పీఈటీ
● చావలి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘటన
6

ఏపీ క్రీడా పాలసీ ఉత్తమం
● ఏఎన్‌యూలో వెయిట్ లిఫ్టింగ్ పోటీల ముగింపు వేడుకల్లో శాప్ చైర్మన్ రవినాయుడు

వ్యవసాయ రంగంలో పీజీ విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు
● యారాతో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒప్పందం

కోడిపోరు
◆ పల్నాడు వీరారాధన ఉత్సవాల్లో నాలుగో రోజు
8

ఈ-నామ్‌ని పాటించాల్సిందే

- జీరో, కటింగ్, బిల్ టూ బిల్ వ్యాపారాలు నిలిపేయాలి
- ఉదయం 8 గంటల వరకే సరుకు రాకకు అనుమతి
- 7 గంటలకు బిడ్డింగ్, ఆ వెంటనే కాటాలు మొదలు కావాలి
- మిర్చి వ్యాపారుల సమావేశంలో మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈనామ్ అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉన్నది. ప్రభుత్వ ఆదేశాలకు లోబడే ఎవరైనా యార్డులో కార్యకలాపాలు కొనసాగించుకోవాలి. నిబంధనలను పాటించకపోతే చర్యలు తీసుకొంటామని మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత ఆదేశాల మేరకు ఆయన గుంటూరు మిర్చియార్డు పరిపాలన భవనంలో ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులు, వేమెన్‌లతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈనామ్ అమలులో ఏమైనా లోపాలు ఉంటే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి అవకాశం ఉంది, అంతేకానీ ఆ విధానానికి వ్యతిరేకంగా ఏమి చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. మిర్చియార్డు సీజన్ ప్రారంభం కాబోతున్న దృష్ట్యా ఏ రోజు వచ్చిన సరుకు ఆ రోజు బయటకు వెళ్లేలా చూడాల్సి ఉంది. ఇందుకోసం ఉదయం 8 గంటల వరకు మాత్రమే యార్డులోనికి లారీలను అనుమతిస్తామన్నారు. ఉదయం 7 గంటలకే బిడ్డింగ్ మొదలు పెట్టి ఆ వెంటనే కాటాలు వేసేలా చూస్తామని చెప్పారు. గేట్ ఎంట్రీ వద్ద లాట్ ఐడీల ఉత్పత్తికి తక్షణ చర్యలు తీసుకొంటామని, సిస్టమ్‌లు, ట్యాబ్‌ల సంఖ్య పెంచి అదనపు డీఈవోలను నియమిస్తామన్నారు. యార్డులోకి వాహన ప్రవేశం, నిష్క్రమణ రెండూ తప్పనిసరిగా ఆన్‌లైన్ లాట్ ఐడీ, గేట్ పాస్ ఈనామ్‌లో రూపొందించబడిందని నిర్ధారించుకోవాలని, మాన్యువల్ గేట్‌పాస్ పూర్తిగా నిషేధిస్తున్నామన్నారు. లైసెన్సు పొందిన తూకందారులందరికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి. ఐడీ కార్డులు, యూనిఫాం ధరించి విధులకు హాజరు కావాలన్నారు. యార్డులో రికార్డులను సరిగ్గా తనిఖీ చేసి యార్డులో కాటాదారుల భౌతిక ఉనికిని క్రాస్‌చెక్ చేస్తామన్నారు. లావాదేవీలు అన్ని ఈనామ్‌లో అమలయ్యేలా సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇప్పిస్తాం. పొరుగుసేవలతో పాటు రెగ్యులర్ సిబ్బందిని సరైన డ్యూటీ ఆర్డర్‌లతో రొటేషన్ ప్రాతిపదికన తగిన ప్రదేశాలలో నియమిస్తామన్నారు. జీరో, బిల్ టూ బిల్, కటింగ్ బిజినెస్‌లు పూర్తి నియంత్రించాలి. అలానే మచ్చుకాయలు తీయడాన్ని కూడా నిలిపేయాలన్నారు. సమావేశంలో పాల్గొన్న వ్యాపారస్థులు మాట్లాడుతూ బిల్ టూ బిల్ వలన రైతు, మార్కెట్ కమిటీ, ప్రభుత్వానికి ఎలాంటి నష్టం లేదన్నారు. ఒక వ్యాపారి వద్ద తగినంత క్రెడిట్ లేకపోతే మరో వ్యాపారి పేరుతో రైతు సరుకుని విక్రయిస్తున్నామన్నారు. రైతు తీసుకొచ్చిన సరకుకు ఒక లాట్ ఐడీని ఉత్పత్తి చేస్తున్నారని, అయితే ఆ రైతు యార్డులో వేర్వేరు దుకాణాల్లో సరుకు అమ్ముతున్నారని, దాని వలన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కటింగ్, జీరో బిజినెస్‌లు పూర్తిగా నిలిపేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ డీడీ ఝాన్సీరాణి, సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులు, సెక్రెటరీలు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, వ్యాపార సంఘాల నాయకులు ఎల్ అప్పిరెడ్డి, పమిడి కృష్ణ, సుధాకర్, నరేంద్ర, తోట రామకృష్ణ, కర్లపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

జగనన్న కాలనీలో.. విద్యుత్ వైర్ల చోరీ

9.30 కి.మీ మేర చోరీకి గురైన వైర్లు

వేమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రం వేమూరు జగనన్న కాలనీలో విద్యుత్ తీగల చౌర్యం జరిగింది. అంబేద్కర్‌నగర్ కాలనీ సమీపంలో 700 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. లబ్ధిదారులందరికీ వారి గృహాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు నాలుగు లైన్ల మెయిన్ తీగలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా ఇచ్చారు. సంబంధించిన స్థలాలలో 400 మంది లబ్ధిదారులు నిర్మాణాలను ప్రారంభించారు. కానీ పనులు పూర్తి కాకుండా వివిధ దశల్లో వదిలివేశారు. కేవలం ముగ్గురు లబ్ధిదారులు మాత్రమే నిర్మాణాలు పూర్తి చేశారు. రోడ్డు మార్గాలు సక్రమంగా లేని కారణంగా ఇతరత్రా సౌకర్యాలు లేవని ఆ ముగ్గురు నివాసం ఉండటం లేదు. కాలనీలో ఏ ఒక్కరూ నివాసం లేరన్న ఉద్దేశంతో విద్యుత్ శాఖ సరఫరాను పూర్తిగా నిలిపి వేసింది. ఈ విషయాన్ని గ్రహించిన దొంగలు 9.30 కి.మీ మేర ఏర్పాటు చేసిన నాలుగు లైన్ల ప్రధానమైన విద్యుత్ లైనులను దొంగించారు. విషయం విద్యుత్ శాఖకు ఆలస్యంగా తెలిసింది. దాదాపుగా రూ.10 లక్షల విలువ చేసే వైర్లను దొంగిలించినట్లు అంచనా. దీనిపై ట్రాన్స్ కో అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వేమూరు జగనన్న కొత్త కాలనీలో దొంగలు కట్ చేసిన విద్యుత్ లైన్లు



విద్యుత్ మెయిన్ లైను వైర్లు చోరీకి గురికాగా మిగిలిన స్తంభాలు

కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రా కుర్రాడు కార్తీక్ రెడ్డికి నాలుగు పతకాలు



గుంటూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సౌత్ ఆఫ్రికాలోని డర్బన్ వేదికగా నవంబరు 28 నుండి డిసెంబరు 1 వరకు జరిగిన కామన్ వెల్త్ కరాటే ఛాంపియన్ షిప్ - 2024 పోటీలలో రాష్ట్రానికి చెందిన అరబండి కార్తీక్ రెడ్డి నాలుగు కాంస్య పతకాలు గెలుచుకొని అంతర్జాతీయ వేదికపై తెలుగు వారి ఖ్యాతిని నిలబెట్టాడు. ఈ మెగా ఈవెంట్‌లో ఎలైట్, క్లబ్ కేటగిరీలలో వేర్వేరు విభాగాల్లో పోటీ పడిన కార్తీక్ రెడ్డి, పసిడి, రజిత (రెండు), కాంస్య పతకాలు కైవసం చేసుకొని అందరి దృష్టిని ఆకర్షించాడు. తన ప్రతిభతో దేశాన్ని గర్వపడేలా చేసిన కార్తీక్ రెడ్డి, భారత్ కరాటే కు గొప్ప పేరు తీసుకువచ్చాడని భారత కరాటే హెడ్ కోచ్ కొండ్రు కీర్తన్ ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ కామన్ వెల్త్ కరాటే ఛాంపియన్ షిప్ 11వ ఎడిషన్ లో భారత్ కు ప్రాతినిధ్యం వహించి నాలుగు పతకాలతో మెరవడం పై నిర్వాహకులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఏపీ నుంచి మొత్తం 15 మంది క్రీడాకారులు ఈ ఈవెంట్‌లో పాల్గొనగా, కార్తీక్ రెడ్డికి మాత్రమే నాలుగు పతకాలు లభించటం విశేషం. తన కుమారుడు అంత ర్జాతీయ వేదికలపై రాణించడంపై తండ్రి హైదరాబాద్ మేడ్చల్ సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ ఎ చంద్రశేఖరరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఆయన గతంలో గుంటూరు సీజీఎస్టీ కమిషనర్‌గా, విజయవాడ కస్టమ్స్ కమిషనర్‌గా పనిచేశారు.

న్యాయమూర్తుల పదోన్నతుల బదిలీలు

గుంటూరు(లీగల్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 15 కోర్టుల్లో పని చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జిలకు సీనియర్ సివిల్ జడ్జిలుగా పదోన్నతి కల్పించి వారిని మరో ప్రాంతానికి బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ మంగళ వారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లాకు సంబంధించి గుంటూరులోని నాలుగవ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎమ్ కుముదినిని ఇక్కడే ఖాళీ గా ఉన్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. ఖాళీ అయిన ఆమె స్థానంలో ప్రస్తుతం నూజివీడులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కే హరి బాబును పదోన్నతిపై నియమించారు. పొన్నూరులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎం అంజనీ ప్రియదర్శినిని పదోన్నతిపై మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు.

2025లో కార్మికులకు ఇచ్చే వేతనంతో కూడిన సెలవులు ఇవే

గుంటూరు(తూర్పు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది 2025 సంవత్సరానికి గాను కార్మికులకు ఇచ్చే వేతనంతో కూడిన సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్ శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా జనవరి 26న రిపబ్లిక్‌డే, మే1 న మే డే, ఆగస్టు15న స్వాతంత్ర్యదినోత్సవం, అక్టోబరు2న గాంధీ జయంతి, నవంబరు1న రాష్ట్ర అవతరణ దినోత్సవం జాతీయ సెలవులుగా, జనవరి 15న కనుమ, మార్చి 3న రం జాన్, ఆగస్టు 27న వినాయకచవితి, డిసెంబరు 25న క్రిస్మస్ పండుగ సెలవులుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. దీనిని గమనించి పరిశ్రమల యజమానులు కార్మికులకు వేతనంతో కూడిన సెలవులను ఇవ్వాలని ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్ క్రీడా పాలసీ ఉత్తమం

● శాప్ చైర్మన్ రవి నాయుడు
● ఏఎన్‌యూలో ముగిసిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న మంగళూరు యూనివర్సిటీ

పెదకాకాని, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడా పాలసీ ఎంతో ఉత్త మంగా నిలుస్తుందని శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో మంగళవారం అంతర యూనివర్శిటీల పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన రాజధానికి అతి దగ్గరలో ఉన్న ఈ యూనివర్సిటీ క్రీడా యూనివర్సిటీగా రూపాంతరం చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. క్రీడాకారులు ఓటమిని విజయానికి మెట్టుగా తీసుకోవాలని ఆయన సూచించారు. నూతన క్రీడా పాలసీ ద్వారా రానున్న రోజుల్లో రాష్ట్రంలో జాతీయస్థాయి క్రీడలతో పాటు ఒలింపిక్స్ కూడా నిర్వహించే అవకాశాలు ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌లు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. ఏపీ పునర్విభజన అనంతరం రాష్ట్రానికి నిధులు,స్థలాలు, ఆస్తులు అన్ని పోయాయని గుర్తుచేశారు. తద్వారా ఇక్కడ క్రీడా వ్యవస్థ దెబ్బతిందని, వాటిపై అధ్యయనం చేసి నేడు నూతన క్రీడా పాలసీని తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న వీసీ గంగాధరరావు, రెక్టార్ కే.రత్న షీలామణి, రిజిస్ట్రార్ సింహాచలం, క్రీడా శాఖ అధిపతి పాల్ కుమార్‌లను అభినందించారు. వీసీ గంగాధరరావు మాట్లాడుతూ గెలిచిన క్రీడాకారులను అభినందించారు. అలాగే, త్వరలో జరగనున్న జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో రాణించి ఆయా వర్సిటీలకు పేరు తేవాలని సూచించారు. నాగార్జున వర్సిటీలో ఉన్న క్రీడా సౌకర్యాలను వినియోగించుకొని రాష్ట్ర ప్రభుత్వం పలు క్రీడా పోటీలను ఇక్కడ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జీ సింహాచలం, వ్యాయామ విద్య డైరెక్టర్, పోటీల నిర్వహణ కార్యదర్శి ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్, ప్రిన్సిపాల్స్ ఆచార్య జాన్సన్, ఆచార్య ప్రమీల రాణి, వెయిట్ లిఫ్టింగ్ పోటీల పరిశీలకులు బడేటి వెంకట రామయ్య, ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు సూర్య నారాయణ, అంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఒలింపిక్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ కార్యదర్శి దిల్లా బాబు, ఒలింపియన్ మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ఓవరాల్ విజేత మంగుళూరు యూనివర్సిటీ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నాలుగు రోజుల పాటు జరిగిన సౌత్ వెస్ట్ జోన్ పురుషుల అంతర విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో టీం ఛాంపియన్‌షిప్‌ను మంగళూరు యూనివర్సిటీ కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో తిరువల్లూరు యూనివర్సిటీ నిలువగా, సావిత్రిబాయి పూలే యూనివర్సిటీ మూడవ స్థానంలో నిలిచింది. పోటీల చివరి రోజు ఫలితాలను పోటీల నిర్వాహక కార్యదర్శి, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ వెల్లడించారు.

చివరి రోజు ఫలితాలు

109 కేజీల విభాగంలో మంగళూరు యూనివర్సిటీ క్రీడాకారుడు ప్రత్యూష్ 312 కేజీల బరువులెత్తి బంగారు పతకాన్ని గెలుపొందారు. జై నారాయణ వ్యాస్ యూనివర్సిటీ క్రీడాకారుడు వినోద్ లఖానీ 308 కేజీల బరువులెత్తి వెండి పతకాన్ని సాధించాడు. యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ క్రీడాకారుడు ఎన్‌పీ అమల్ కాంస్య పతకం పొందాడు.

ప్లస్ 109 కేజీల విభాగంలో

మహారాజ గంగా సింగ్ యూనివర్సిటీ క్రీడాకారుడు కేశవ్ బిస్సా 335 కేజీల బరువులు ఎత్తి బంగారు పతకాన్ని సాధించారు. మంగళూరు యూనివర్సిటీ క్రీడాకారుడు జోష్వా రాజకుమార్ 297 కేజీల బరువులెత్తి వెండి పతకాన్ని , యోగి వేమన యూనివర్సిటీ క్రీడాకారుడు గోగులోతు రాజశేఖర్ 295 కేజీల బరువులెత్తి కాంస్య పతకం సాదించారు.

వ్యవసాయ రంగంలో పీజీ విద్యార్థినులకు స్కాలర్ షిప్‌లు

● యారాతో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒప్పందం



స్కాలర్ షిప్ ల ఒప్పందం పత్రాలను అందుకుంటున్న వీసీ శారద జయలక్ష్మి,యారా ఫెర్టిలైజర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మంజుల

తాడికొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అత్యంత సంక్లిష్టమైన వ్యవసాయ విద్య వైపునకు విద్యార్థినులను మళ్లించేందుకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అడుగు ముందుకు వేసింది. వ్యవసాయ రంగంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసే విద్యార్థినులకు స్కాలర్ షిప్ లు అదించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈమేరకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి బెంగుళూరుకు చెందిన అంతర్జాతీయ సంస్థ యారా ఫెర్టిలైజర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో మంగళవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ప్రపంచ స్థాయిలో మొక్కలు పోషణకు సంబంధించి 50 దేశాల్లో విస్తరించిన ఈ సంస్థ భారతదేశంలో డిజిటల్ ఫార్మింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో బెంగుళూరులో యూనిట్ ఉంది. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సాయిల్ సైన్స్, క్రాప్ ఫిజియాలజీ మొదలగు సబ్జెక్టుల్లో రెండేళ్ల పాటు పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థినులకు ఈ సంస్థ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయనుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇది అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఒప్పంద పత్రాలను వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి,యారా ఫెర్టిలైజర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి మంజుల బీఎస్ మార్చుకున్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జీ రామచంద్రరావు, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టరు సీహెచ్ శ్రీనివాస్ రావు, డీన్ పీజీ స్టడీస్ డాక్టరు ఏవీ రమణ, డీన్ కమ్యూనిటీ సైన్స్ డాక్టరు బీ శ్రీలక్ష్మి, డీన్ ఇంజినీరింగ్ డాక్టరు ఎ.మణి, పరిశోధన సంచాలకులు డాక్టరు ఏవీ సత్యనారాయణ, సీఓఈ డాక్టరు డీ. సంపత్ కుమార్, యారాకంపెనీ ప్రతినిధి మంజుల బీఎస్, రిజిస్ట్రార్ రామచంద్రరావు, డాక్టర్ సీ.హెచ్ శ్రీనివాస్‌రావు, డాక్టర్ ఏ.వీ.రమణ, డాక్టర్ బీ.శ్రీలక్ష్మీ, డాక్టర్ ఏ.మణి, యారా జోనల్ హెడ్ అన్నుమన్ శర్మ, విశ్వవిద్యాలయం ప్రజా సంబంధాల అధికారి విశాలాక్షి, లైబ్రేరియన్ డాక్టరు పీ సాంబశివరావు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, తొలి రాష్ట్రపతి, మొదటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ జయంతిని విశ్వవిద్యాలయంలో నిర్వహించారు.

విద్యార్థిని చితకబాదిన పీఈటీ



వీపుపై వాతలు తేలి ఉండటాన్ని చూపిస్తున్న విద్యార్థి సాయిపునీత్

వేమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని వ్యాయామ ఉపాధ్యాయుడు చితక బాదిన సంఘటన మండలంలోని చావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ వారం జరిగింది. ఈ సంఘటనకు సం బంధించిన వివరాలు.. ఆ పాఠశాలలో విద్యార్థి ఎస్.నాగసాయి పునీత్ 8వ తరగతి చదువు తున్నాడు. అదే పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా వీర్ల శ్రీనివాసరావు పనిచేస్తున్నాడు. పాఠశాల బ్రేక్ టైం మధ్యా హ్నం రెండున్నర గంటల సమయంలో పునీత్ తోటి విద్యార్థులతో గ్రౌండ్‌లో ఆడుకుంటున్నాడు. అదే సమయంలో వ్యాయామ ఉపాధ్యాయుడు విద్యార్థులందరినీ అసెంబ్లీకి రావాలని పిలిచారు. పునీత్ తోటి విద్యార్థులతో కలిసి అసెంబ్లీ ప్రాంతానికి వెళ్లాడు. అయితే, ఆలస్యంగా వచ్చావంటూ పునీత్ వీపుపై వ్యాయామ ఉపాధ్యాయుడు కొట్టాడు. దీంతో, ఆ విద్యార్థి వాంతులు చేసుకుని స్పృహ తప్పి పడిపోయాడు. కొంత సేపటి తర్వాత పక్కనే ఉన్న విద్యార్థి సోదరుడు సుజిత్‌సాయిమోహన్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. పునీత్ కుటుంబ సభ్యులు పాఠశాలకు చేరుకుని విద్యార్థి పరిస్థితిని గుర్తించారు. వీపుపై వాతలు ఏమిటని ప్రశ్నించారు అందుకు వ్యాయామ ఉపాధ్యాయుడు దురుసుగా సమాధానమిచ్చాడు. దీంతో, విద్యార్థి కుటుంబసభ్యులు వేమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. పీఈటీపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

ఆరు రైల్వేస్టేషన్లలో పార్శిల్ కార్యాలయాల మూత

● తక్షణం అమలు చేయాలని పీసీసీఎం ఆదేశాలు

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన పార్శిల్ కార్యాలయాలను తక్షణం మూసి వేయాల్సిందిగా ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో మొత్తం ఆరు స్టేషన్లలో ఈ పార్శిల్ కార్యాలయాలు బుధవారం నుంచే మూతపడ నున్నాయి. బుకింగ్, రిసీవింగ్ రెండూ నిలిపేయనున్నారు. డివిజన్ పరిధిలో సత్తెనపల్లి, పేరేచర్ల, పిడుగురాళ్ల, నంబూరు, మాచర్ల, దిగువమెట్ట రైల్వేస్టేషన్లలో ఏర్పాటు చేసిన పార్శిల్ కార్యాలయాలకు తగిన ఆదరణ లేని కారణంగా రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకొన్నట్లు సమాచారం. దీంతో, సరుకు ఎగుమతి, దిగుమతి చేసుకొనేవారు ప్రత్యామ్నాయ రైల్వేస్టేషన్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. కార్గో సేవలను విస్తరించే క్రమంలో రైల్వే శాఖ ఎక్కడికక్కడ పార్శిల్ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. మిర్చి, అపరాలు, ధాన్యం, ఎరువులు, పురుగుమందులను ఎక్కువగా పల్నాడులోని వివిధ ప్రాంతాల్లో ఎగుమతి/దిగుమతి చేసుకొంటుంటారు. దీనిని పరిగణన లోకి తీసుకొని రైల్వే శాఖ పార్శిల్ కార్యాలయాలను ప్రారంభించి వీటి సేవలను వినియోగించు కోవాల్సిందిగా స్థానిక వ్యాపారులకు విజ్ఞప్తి చేసింది. అయితే, ఆశించినంత స్పందన కనిపించలేదు. సుమారు ఏడాదికి పైగానే చూసినా స్పందన లేకపోతుండటంతో పార్శిల్ కార్యాలయాలను శాశ్వతంగా మూసేయాలని నిర్ణయం తీసుకొంది.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం



భక్తులను ఉద్దేశించి సందేశం ఇస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

వట్టిచెరుకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని, ప్రపంచ వ్యాప్తంగా ఆ బోధనలు చేసిన పునీత శౌరి మహోన్నత వ్యక్తి అని గుంటూరు బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య పేర్కొన్నారు. మండలంలోని ముట్లూరులో పునీత శౌరి దేవాలయ తిరునాళ్ళ మంగళవారం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం బలి పూజా కార్యక్రమానికి తరలివస్తున్న బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్యను ముట్లూరు వెలుపుల నుంచి ప్రత్యేక వాహనంపై స్థానిక దేవాలయ ఫాదర్ దిలీప్ కుమార్ సాదరంగా దేవాలయ ప్రాంగణానికి తీసుకు వచ్చారు. తొలుత ఆలయంలోని పునీతశౌరి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన నిత్య ఆరాధన మందిరాన్ని ప్రారంభించారు. దేవాలయ ప్రాంగణంలోని ప్రత్యేక వేదిక పై నుంచి వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ఫాద ర్లతో భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిం చారు. భక్తులు సాయంత్రం కొవ్వొత్తులతో ఆలయ ప్రదక్షిణ నిర్వ హించారు. తేరు ఉత్సవం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కొన సాగింది. తిరునాళ్ళ సందర్భంగా వట్టిచెరుకూరు సీఐ రమా నాయక్, ఎస్ఐ సుబ్బారావు, ప్రత్తిపాడు, కాకుమాను ప్రాంతాల ఎస్ఐలు, సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు.

గంజాయి విక్రేత అరెస్టు

● 120 గ్రాముల గంజాయి స్వాధీనం

చిలకలూరిపేట డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం తిమ్మాపురంలో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి గంజాయి విక్రేత ఓంప్రకాష్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నరసరావుపేట ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీనివాసమూర్తి, చిలకలూరిపేట ఎక్సైజ్ సీఐ కే వినయ్‌కుమార్, తమ సిబ్బందితో కలిసి సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించారు.

40,893 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 42,929 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 40,893 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 39,454 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	15000	334	7500	14500
నెంబరు. 5	8500	11200	నెంబరు.5	10000	12000
273	8000	8000	273	9500	14000
341	8000	12500	341	7500	14000
4884	14500	14500	4884	11500	11500
సూపర్ 10	10500	10500	సూపర్ 10	10000	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	16300	తేజ	7500	16500
బ్యాడిగి	8000	14500	బ్యాడిగి	8000	13000
దేవనూరు డీలక్స్	9000	13500	దేవనూరు డీలక్స్	10500	12000
తెల్లకాయలు	4000	11000	తెల్లకాయలు	4000	10200

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98.107.118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

ఎస్పీ చొరవతో వలస కార్మికులకు విముక్తి

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ చొరవతో 10 మంది వలస కార్మికులకు వెట్టి చాకిరి నుంచి విముక్తి కలిగింది. మహారాష్ట్రలో ఓ కాంట్రాక్టర్ వద్ద చిక్కుకున్న తమ వారికి విముక్తి కల్పించాలని కుటుంబ సభ్యులు ఎస్పీని కోరడంతో కార్మికుల విడుదల కోసం ఆయన ప్రత్యేక చొరవ చూపారు. గుంటూరు నగరం నుండి తాపీ పనుల నిమిత్తం సుమారు రెండు నెలల క్రితం 10 మంది కార్మికులు హైదరాబాదుకు వలస వెళ్ళారు. అక్కడ పనులు అయిపోవడంతో, మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలోని గెవ్రాయ్‌లో తాపీ పనుల నిమిత్తం వెళ్ళారు. తాపీ పనులకు బదులు డ్రైనేజీ పనులను పురమాయించి సరైనవసతి, భోజనం పెట్టకుండా సుమారు నెల రోజులుగా యజమాని వేధించాడు. పారిపోవడానికి యత్నించిన వారిని యజమాని కొట్టడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ సమా చారాన్ని కార్మికులు తమ కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు ఎస్పీని వేడు కున్నారు. వెంటనే స్పందించిన ఎస్పీ నగరం పాలెం ఎస్సై బాషా నేతృత్వం లోని ప్రత్యేక బృందాన్ని మహారాష్ట్రకు పంపి.. వారిని గుంటూరుకు తీసుకు వచ్చారు. కార్మికుల కష్టానికి తగిన వేతనం సుమారు రూ.93 వేలు కూడా యజమాని నుండి ఇప్పించారు.

7న మెగా పేరెంట్స్ మీటింగ్స్

వేమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు ఈ నెల 7వ తేదీ ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్స్ నిర్వహించనున్నారు. విద్యాశాఖ కమిషనర్ సూచించిన నిబంధనల మేరకు సమావేశాలు నిర్వహించేందుకు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో ఉన్న పాఠశాలల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు ఇతర పెద్దలతో సంయుక్తంగా ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని ఐదు ఉన్నత పాఠశాలలను ప్రత్యేకంగా ఎంపిక చేశారు. కొల్లూరు బాలురోన్నత పాఠశాల, దోనేపూడి, అమృతలూరు, చుండూరు, భట్టిప్రోలు మండల కేంద్రాల్లోని ఉన్నత పాఠశాలల్లో సమావేశాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 240 మంది విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. మండల పరిధిలోని పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వరద బాధిత ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు దుప్పటి, ప్యాడ్లు, పెన్నులు తదితర వస్తువులతో కూడిన కిట్ బ్యాగ్‌ను రాష్ట్ర ఏపీటీఎఫ్ అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చాంద్‌బాషా, ఉపాధ్యాయ వాణి సంపాదకులు షేక్ జిలాని, మాజీ రాష్ట్ర కార్యదర్శి బి.రఘుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పిడి సోషలిజం, రాష్ట్ర కౌన్సిలర్స్ టి.శ్రీనివాసరావు, పద్మావతి, జిల్లా కార్యదర్శి దోవ రవి, కె.వెంకటరత్నం, ఎం.హరిప్రసాద్, హెచ్ఎం మహబూబ్ బాషా, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, ఏపీటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని ధర్నా

రేపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విరామ సమయంలో ఇంజనీరింగ్ సిబ్బంది ధర్నా నిర్వహించి కమిషనర్ సాంబశివరావుకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ మాట్లాడుతూ జీవో నెంబరు 36/2024 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. రేపల్లె మున్సిపల్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ప్రభాకరరావు, కార్యదర్శి ఎన్.రవిబాబు, శివ, రవి, రాఘవేంద్రరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంత ఇంటి కల నెరవేర్చడం కూటమి ప్రభుత్వ లక్ష్యం

నగరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పేదవానికి సొంత ఇంటి కల నెరవేర్చడం కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పని చేస్తుందని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పూర్తయిన 66 గృహాలకు గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా నూతన గృహ నిర్మాణం నమోదు చేసుకోవడానికి పంచాయతీలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను కలసి ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు ఇచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారి సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువమోర్చా ఆధ్వర్యంలో సంబరాలు

బాపట్ల, డిసెంబరు 03 (ఆంధ్రజ్యోతి) : విశాఖ రైల్వేజోన్‌కు స్థలం కేటాయించి నిధులు సమకూర్చటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ యువమోర్చా అధ్యక్షులు నాళం నరేష్ ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. జీబీసీరోడ్డులోని పోలేరమ్మ దేవాలయం దగ్గర కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో అన్ని నియోజకవర్గాలలో మహాయుతి అభ్యర్థులు విజయం సాధించినందుకు బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షులు మామిడి రమేష్‌కుమార్, బి.బాబునాగేంద్ర, బొమ్మిశెట్టి ప్రసాద్, ఇమ్మడిశెట్టి రాము, ముప్వల శ్రీనివాస్, వీర్రాజు, యర్రంశెట్టి సుభాస్, సుజిత్,విజయ తదితరులు పాల్గొన్నారు.

పశువుల షెడ్‌ను పరిశీలించిన ఎంపీడీవో

కర్లపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండల నల్లమోతువారిపాలెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న పశువుల షెడ్‌ను ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు మంగళవారం సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో మహేష్, కార్యదర్శి వెంకటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కర్లపాలెం మండల నల్లమోతువారిపాలెం వెన్నెలకంటి ఎస్టీకాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌ను ఎంపీడీవో శ్రీనివాసరావు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

పిట్టలవానిపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చందోలు జలవనరుల సెక్షన్ పరిధిలో ఈనెల 8న జరగాల్సిన 10 సాగు నీటి సంఘాల ఎన్నికలు అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు చందోలు జలవనరుల శాఖ సెక్షన్ ఏఈఈ కె.విజయబాబు మంగళవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణ తెలియజేస్తామన్నారు.

26 నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

పిట్టలవానిపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 26వ తేదీ నుంచి జరుగుతుందని పిట్టలవానిపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎండీ అప్జల్ తెలిపారు. గతంలో సభ్యత్వాలు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ నూతన సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోవాలని, నూతనంగా పార్టీలో చేరిన కార్యకర్తలు, నాయకులు విధిగా టీడీపీ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని, సంబంధిత యాప్‌ల ద్వారా నమోదు చేసుకోవాలని ఎండీ అప్జల్ తెలిపారు.

కేటాయించిన బాధ్యతలు సమర్థంగా నిర్వహించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి, చిత్రంలో ఎస్పీ తుషార్ డూడి , జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల,డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులకు కేటాయించిన బాధ్యతలు సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనపై కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వాహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా ఆహ్వానించే ప్రక్రియను 5వ తేదిన ప్రారంభించాలన్నారు. విద్యార్థుల సమగ్ర ప్రగతి పత్రాలపై తల్లిదండ్రులతో చర్చించి అంశానికి ఎలాంటి విఘాతం ఏర్పడకుండా చూడాలన్నారు. తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు నిర్వహించే సమావేశంలోనే ముఖ్యమంత్రి హాజరవుతారని వివరించారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్గాఫ్ వార్ పోటీలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల కొరకు 23 ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ తుషార్‌డూడి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

9 నుంచి రెవెన్యూ సదస్సులు : కలెక్టర్

రెవెన్యూ సదస్సులు ఈనెల 9 నుంచి జనవరి 5వ తేది వరకు జరుగుతాయని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. రెవెన్యూఅంశాలపై తహసీల్దార్‌లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రెవెన్యూసదస్సులు జయప్రదంగా నిర్వహించాలని ఆదేశించారు. రెవెన్యూ దస్త్రాలలో వివరాలు లేవని ప్రజలను వెనుకకు పంపటం ఏమిటని, వాటిపై వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. శాసన మండలి ఎన్నికల నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీటి సంఘాల ఎన్నికలకు ఈనెల 5న నోటిఫికేషన్ విడుదల చేయాలని కలెక్టర్ చెప్పారు. భూముల రీసర్వేలో అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవోలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల లక్ష్యం పూర్తి చేయాలి

రాష్ట్రంలో లక్ష గృహాల గృహప్రవేశ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు ఇచ్చిన లక్ష్యాలు పూర్తి చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. గృహప్రవేశాలపై మండల ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గృహనిర్మాణ సంస్థ ద్వారా రాష్ట్రంలో లక్ష గృహాల గృహప్రవేశ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 20 నుంచి 30వ తేదీలోగా జరుగుతుందన్నారు. జిల్లాలోని 6 నియోజకవర్గాల నుంచి 30 మంది లబ్ధిదారులకు సీఎం చేతుల మీదగా ఇంటి తాళాలు నేరుగా ఇవ్వటం జరుగుతుందన్నారు. అదేరోజు జిల్లాలో మిగిలిన లబ్ధిదారులకు గృహ నిర్మాణ సముదాయాల వద్ద పండుగ వాతావరణంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తాళాలు అందజేస్తారని చెప్పారు. గృహాలులేని వారికి ప్రధానమంత్రి ఆవాసయోజన 2ఎ కింద గృహాలు మంజూరు చేయటానికి రిజిస్ట్రేషన్ చేయించాలని తెలిపారు. సమావేశంలో గృహనిర్మాణ సంస్థ పీడీ వై.వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ పి.పద్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం.అనంతరాజు జిల్లాలోని అధికారులు, ప్రత్యేకాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

సీఎం కార్యాలయానికి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలి

ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసిన అర్జీలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారవేదిక అమలు తీరుపై జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో మంగళవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని గడువులోగా పరిష్కరించాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. నీటి తీరువా పన్ను వసూళ్ళ లక్ష్యం మేరకు సేకరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్, సారా రహిత సమాజాన్ని స్థాపిద్దాం

● బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ గీతిక

బాపట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్, సారా రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.గీతిక కోరారు. పట్టణంలోని మొదుగుల శ్రీరామిరెడ్డి డిగ్రీ కళాశాల, స్వావర్షపురం గ్రామాలలో డ్రగ్స్, సారాహిత ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాలలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ యువతరం ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని భవితను మలుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రభుదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, ఇతర మత్తు పదార్థాల వ్యసనం మనిషిని దహించివేస్తుందని జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని పొన్నపల్లి గీతం జూనియర్ కళాశాలలో గంజాయి, ఇతర మారకద్రవ్యాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఆదేశాల మేరకు నగరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ మార్తురి శ్రీరామ్‌ప్రసాద్ సదస్సు జరిపారు. డ్రగ్స్‌ని తరిమేద్దాం-ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దాం అని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది, పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం.. రైతులకు నష్టం


నేలవాలిన పైరును పైకి లేపి కట్టలు కడుతున్న రైతు గరికపాటి మాధవరావు

బాపట్ల, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి) : అల్పపీడన ప్రభావంతో మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. చలిగాలులతో పెద్దఎత్తున కురుస్తున్న వర్షం కారణంగా వరిపైర్లు అనేకచోట్ల నేలవాలాయి. చెల్లాచెదురుగా పడిపోయిన పైర్లపై వర్షపునీరు నిల్వటంతో వరి గింజలు మొలకెత్తుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి అనేక కష్టనష్టాలు ఎదుర్కొని పండించిన పంట చేతికందివచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నష్టపోతున్నామని రైతులు కన్నీరుపెట్టుకుంటున్నారు. నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో 53వేల ఎకరాలలో వరిసాగు చేశారు. ప్రస్తుతం ముందుగా విత్తిన పైర్లు కోతకు వచ్చాయి. ఇలాంటి పరిస్థితులలో నేలవాలిన వరికంకులు తడిచి మొలకెత్తే అవకాశం ఉంది. ప్రతిరోజు రాత్రిపూట భారీ వర్షం కురుస్తున్నది. ఆలస్యంగా విత్తిన పైర్లు నేలవాలటం వల్ల కంకి పాలుపోసుకోకుండా తాలుకంకిగా మారే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు. అనేక ప్రాంతాలలో నేలవాలిన పైర్లను రైతులు పైకి లేపి కట్టలు కట్టుకుంటున్నారు. ఇదేవిధంగా వర్షం కురుస్తూ ఉంటే మరింత నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంస్య పతకం సాధించిన కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందనలు

బాపట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వీరంకి నరేంద్ర ఆలిండియా పెన్‌కాక్ సిలాట్ ఛాంపియన్‌షిప్ 2024 పోటీలలో పాల్గొని కాంస్య పతకం సాధించారు. జాతీయ స్థాయిలో జిల్లా పోలీసుశాఖ ఖ్యాతిని చాటిన నరేంద్రను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ తుషార్‌డూడి అభినందించి మెడల్‌తో సత్కరించి మెమోంటో అందజేశారు. శ్రీనగర్‌లో జరిగిన పోటీలలో ఎబోవ్ 110 విభాగాలలో కర్లపాలెం కానిస్టేబుల్ కాంస్యపతకం సాధించగా అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో మంచి తర్ఫీదు పొంది అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. మిగిలిన సిబ్బంది కూడా నరేంద్రను స్ఫూర్తిగా తీసుకొని క్రీడలలో రాణించాలని ఎస్పీ సూచించారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై శిక్షణ

బాపట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల విస్తరణా శిక్షణా కేంద్రంలో 7 జిల్లాలకు సంబంధించి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అనే అంశంపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి, విస్తరణాధికారి, సూపర్‌వైజర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఇలా ప్రతి మండలం నుంచి ఆరుగురు చొప్పున శిక్షణకు హాజరుకావాలన్నారు. 4 నుంచి 7వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మండలస్థాయిలో మండలాధికారులదరికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటనతో మున్సిపల్ హైస్కూల్‌కు మహర్దశ


మున్సిపల్ హైస్కూల్ లోపల నుంచి ఉప్పరపాలెం వెళ్ళే సీసీరోడ్డు వరకు నిర్మించిన రోడ్డు

బాపట్ల, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 7వ తేదిన బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌కు రానుండటంతో అధికారయంత్రాంగమంతా స్కూల్‌లోనే ఉండి పనులు చకచకా చేయిస్తున్నారు. నిన్నటి వరకు పాఠశాల చుట్టుపక్కల పిచ్చిమొక్కలు, ఇసుకదిబ్బలు, మెరకలు, పల్లాలతో అధ్వానంగా ఉండేది. ప్రస్తుతం ఈప్రాంతాన్ని చదును చేసి శుభ్రం చేయిస్తున్నారు. ఉప్పరపాలెం వెళ్ళే సీసీరోడ్డు నుంచి ఇండోర్ స్టేడియం పక్కగా మున్సిపల్ హైస్కూల్‌కు వచ్చే దారి ఇసుకతో అధ్వానంగా ఉండేది. ప్రస్తుతం దీనిని మెటల్‌రోడ్డుగా అభివృద్ధి చేశారు. నూతన భవనం ఎదుట ఇసుక ఉండేది, ఈ ఇసుకలో విద్యార్థులు నడుస్తూ ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రి రాక కోసం ఈ ప్రాంతాన్ని కూడా శుభ్రం చేసి గ్రావెల్ పరిచారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నిటికి పరిష్కారం చూపిస్తూ యుద్ధప్రాతిపదిక మరమ్మతులు చేయిస్తున్నారు. ముఖ్యమంత్రి దిగే హెలీప్యాడ్ దగ్గర నుంచి మున్సిపల్ హైస్కూల్ వరకు రోడ్డును అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. పోలీసు పేరెడ్‌గ్రౌండ్ దగ్గర నుంచి శుభ్రం చేయిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్‌యార్డు నుంచి పాతబస్టాండ్ వరకు డివైడర్ల మధ్య మొక్కలు నాటిస్తున్నారు.

ఘనంగా వ్యవసాయ విద్యాదినోత్సవం

బాపట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో మంగళవారం వ్యవసాయ విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వతంత్ర భారత తొలి రాష్ట్రపతి, కేంద్ర వ్యవసాయశాఖా మంత్రి డాక్టర్ రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని సరస్వతీమెమోరియల్ బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో వ్యవసాయం, వ్యవసాయ విద్య ప్రాముఖ్యతను వివరించారు. వ్యవసాయం కొనసాగించటానికి ప్రేరేపించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ సోమేశ్వరరావు, డాక్టర్ ఇ.గౌతమి, డాక్టర్ పి.అరుణకుమారి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా సంఘటన పర్వ్ సంస్థాగత నిర్మాణ కార్యాశాల

బాపట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతాపార్టీ జిల్లా సంఘటన పర్వ్ సంస్థాగత నిర్మాణ కార్యాశాల మంగళవారం పట్టణంలోని అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కళ్యాణమండపంలో జరిగింది. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని దిశ,నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి పుట్టేటి సురేందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి పులి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముప్వల వెంకటరమణరావు, జిల్లా సహాయ ఎన్నికల అధికారులు రాంపల్లి జగన్నాథశాస్త్రి, బండారుపల్లి హేమంత్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుగ్గుణ గణేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మండవ రామకృష్ణ, వల్లూరి భావన్నారాయణ, అన్నం వెంకటేశ్వరరావు, జిల్లా మోర్చాఅధ్యక్షులు కొక్కిలి గడ్డ శ్రీనివాసరాజు, నాశన మణికుమార్, గుమ్మడి సాంబశివరావు, కొండమూది బంగారుబాబు, కాకర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై ప్రజలను చైతన్యవంతం చేయాలి

రేపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్‌పై ప్రజలను చైతన్యవంతం చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవి అన్నారు. మండలంలోని శ్రీ ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఆదేశాల మేరకు ప్రపంచ ఎయిడ్స్ డే వారోత్సవాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టిసి రవి మాట్లాడుతూ వారం రోజుల నుంచి విద్యార్థులు వివిధ అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యపరుస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.బుజ్జిబాబు మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు రంగోలి పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అధ్యాపకులు బి కోటేశ్వరరావు, వివి రవీంద్ర, ఎం.దాసు, బాలగురవయ్య పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సమాజంలో ప్రత్యేక స్థానం కల్పించాలి

● లీగల్ వలంటీర్ పఠాన్ మహ్మద్‌ఖాన్

బాపట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక ప్రతిభావంతులకు మనోధైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందించటంతోపాటు వారికి సమాజంలో ప్రత్యేక స్థానం కల్పించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని లీగల్ వలంటీర్ పఠాన్ మహ్మద్‌ఖాన్ కోరారు. మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్ వద్ద గల మున్సిపల్ స్కూల్‌లో మంగళవారం ప్రపంచ ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. న్యాయవాది శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త రజనీ, సిబ్బంది పాల్గొన్నారు.

● బాపట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని వెదుళ్ళపల్లి బధిరుల ఆశ్రమపాఠశాల విద్యార్థులకు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవీ బ్రహ్మం కిట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ అధ్యక్షుడు శ్రీహరిరావు, సెక్రటరి జేవీ కృష్ణారావు, కోశాధికారి బొలగాని వెంకటేశ్వర్లు, జీవీ సుబ్రహ్మణ్యం, కాళిదాసు, వీరభద్రయ్య, రామనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లె, డిసెంబరు, (ఆంధ్రజ్యోతి) 3 : అంతర్జాతీయ 59వ దివ్యాంగుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం జరిపారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జానం మురళీ అధ్యక్షత వహించారు. దివ్యాంగుల కోసం కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవి నాగేశ్వరరావు, రాష్ట్ర వికలాంగుల సంఘం అధ్యక్షుడు నీలజోజు బాబు, ఎన్ఆర్ఐ పరుచూరు శ్రీనాద్, మేక రామకృష్ణ, ఉపాధ్యాయురాలు అనూరాధ, కొక్కిలగడ్డ శివశంకర్‌రాజు, జీపీఎస్ వరప్రసాద్, ఎ.మధుసూదనరావు పాల్గొన్నారు.


సత్కారం అందుకున్న అనగాని శివప్రసాద్ తదితరులు

● కర్లపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం ఇందిరానగర్‌లోని భవితా సెంటర్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. భవితా సెంటర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజ, ఉపాధ్యాయులు లక్ష్మీ ప్రసన్నలు విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్స్, డ్రాయింగ్, త్రో అండ బాల్ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ శ్రీధర్, జాన్, లక్ష్మీచందన తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంను భవిత కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని భవిత కేంద్రాల్లో నిర్వహించిన వేడుకల్లో ఎంఈవోలు జ్యోతి, రిటైర్డ్ హెచ్ఎం కె.కాంతారావు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు అరవింద్ పాల్గొన్నారు. 6 నుంచి 18 సంవత్సరాల దివ్యాంగ పిల్లలకు క్రీడ పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు ఉమాదేవి, హవీలా ప్రశాంతి, ఉపాధ్యాయులు మేరి ఇవాంజిలిన్, కె.రత్నాకర్, డి.ధనరాజ్, ఆంథోనమ్మ, కల్పన, దివ్యాంగుల తల్లిదండ్రులు, సంరక్షకులు పాల్గొన్నారు.

● చుండూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మున్నంగివారిపాలెం ఎంపీపీఎస్ పాఠశాలలో, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన శారీరక మానసిక వికలాంగులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సలోమాన్, హెచ్ఎం భాస్కర్, కె.శివకుమారి, ఎం.శ్రీనివాసరెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంధ వికలాంగులకు ప్రభుత్వపరంగా అందే వివిధ పథకాల గురించి తల్లిదండ్రులకు వివరించారు.


యువ ఉత్సవ్ గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్

యువత నైపుణ్యాలకు యువజనోత్సవాలు చక్కటి వేదిక

రేపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : యువతి నైపుణ్యాలను ప్రదర్శించడానికి యువజనోత్సవాలు చక్కటి వేదిక అని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. భారత ప్రభుత్వ క్రీడా, యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం, గుంటూరు, శ్రీ వెలగపూడి రామకృష్ణ, మత్తి శివశంకరరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీ నుంచి జిల్లా స్థాయి యువ ఉత్సవాలు జరగనున్నాయి. నగరంలోని శ్రీవెలగపూడి రామకృష్ణ మెమోరియల్ కాలేజీలో జరగనున్న ఈ పోటీల యువ ఉత్సవ్ 2024 గోడ ప్రతులను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ యువత జాతీయ స్థాయి వరకు తమ ప్రతిభను ప్రదర్శించడానికి యువజనోత్సవాలు ఉపయోగపడతాయన్నారు. నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి దేవిరెడ్డి కిరణ్మయి మాట్లాడుతూ భారత్ 2047 అనే థీమ్‌తో పెయింటింగ్, లైటింగ్, సైన్స్ మేళా, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గెలిచిన వారికి నగదు బహుమతి, ప్రశంసా పత్రంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపబడతారని చెప్పారు. మత్తి శివశంకరరావు ట్రస్ట్ చైర్మన్, మత్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వాలను వేగవంతం చేయాలి

● ఎమ్మెల్యే ఆనందబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 3 : పార్టీ సభ్యత్వాలు వేగవంతం చేయాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. స్థానిక ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో మంగళవారం మండల స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. ప్రజలు టీడీపీలో చేరేందుకు ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడే వారిని ఎప్పటికి మర్చిపోదన్నారు. రానున్న నీటి సంఘాల ఎన్నికలు, సొసైటీ ఎన్నికలపై ఆయా గ్రామాల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు మాట్లాడుకుని ఏకగ్రీవాలు అయ్యే విధంగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యలవర్తి బ్రహ్మానందం, కొత్తపల్లి రవీంద్రబాబు, గొట్టిపాటి భానుగంగాధర్, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కొల్లూరులో టీడీపీ మండల విస్తృతస్థాయి సమావేశం

కొల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరులో టీడీపీ మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశం బుధవారం జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ తెలిపారు. కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో జరిగే విస్తృత స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొంటారు. సమావేశంలో సాగునీటి సంఘాలు, సొసైటీ ఎన్నికలు, టీడీపీ సభ్యత్వ నమోదు వంటి పలు అంశాలపై చర్చించడం జరుగుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జాయింట్ కలెక్టర్‌ను కలిసిన బావుడా ఛైర్మన్


జేసీ ప్రఖర్‌జైన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజశేఖర్‌బాబు

బాపట్ల, డిసెంబరు 03 (ఆంధ్రజ్యోతి) : జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బావుడా ఛైర్మన్‌గా నియమితులైన ఆయన వివిధ అంశాలపై జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడారు. ఇందులో జాయింట్ కలెక్టర్ వైస్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. దీంతో వీరి కలయిక ప్రాధాన్యతను సంతరించుకుంది.

విద్యార్థులతో పనులు... పెద్దఎత్తున విమర్శలు


మ్యాట్‌లను ట్రక్కులో నుంచి దించుతున్న విద్యార్థులు

బాపట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసేందుకు మంగళవారం మినీ ట్రక్కులో మ్యాట్‌లు తీసుకొచ్చారు. తీసుకొచ్చిన మ్యాట్‌లను పాఠశాల విద్యార్థులతో దింపించి లోపలకు మోపించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు ఈ విధంగా విద్యార్థులతో పనులు చేయించటంపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. కొద్ది రోజులుగా ఎవరికి వారు విద్యార్థులతో పనులు చేయిస్తూ చదువులకు దూరం చేస్తున్నారు. మెగా టీచర్స్ అండ్ పేరెంట్స్ మీటింగ్‌కు వచ్చే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి ఇలాంటి సంఘటనలు వివరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాజీ మంత్రి గాదె


కలెక్టర్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గాదె వెంకటరెడ్డి

బాపట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, ఆయన తనయుడు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూధనరెడ్డిలు మంగళవారం కలెక్టర్ జె.వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి పలు విషయాలు వివరించారు. అదేవిధంగా జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను కూడా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గాజుల్లంక రీచ్‌లో ఆగిన ఇసుక లోడింగ్

● వే బిల్లులు ఇవ్వడం లేదని వాహనదారుల ఆరోపణ


గాజుల్లంక వద్ద ఇసుక కోసం వచ్చిన లారీ

కొల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గాజుల్లంక వద్ద ప్రభుత్వ ఇసుక డంపింగ్ యార్డులో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఇసుక లోడింగ్‌ను నిలిపివేశారు. వాహనదారులు ఇసుకకు సంబంధించి బిల్లులు ఇవ్వాలని బిల్లులు లేకుండా ఇసుక రవాణా చేస్తే మార్గం మధ్యలో పోలీసు, రెవెన్యూ అధికారులు తరలిస్తున్న ఇసుకకు వే బిల్లులు చూపమంటే తాము ఏమి చేయాలని నిర్వాహకులను నిలదీశారు. దీంతో నిర్వాహకులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఇసుక కోసం వచ్చిన ట్రాక్టర్లు మాత్రం నిర్వాహకులతో పని లేకుండా రీచ్‌లో వెళ్లి కూలీలతో లోడ్ చేయించుకుని ఇసుకను తరలించుకుంటున్నారు. ఇసుక లోడింగ్ అయిన లారీలు మాత్రం వే బిల్లులు కోసం అక్కడే నిర్వాహకుల రాక కోసం ఎదురు చూస్తున్నాయి. నిర్వాహకులు మాత్రం తాము వే బిల్లులు ఇస్తున్నామంటూ చెబుతున్నారు. నిలిచిపోయిన ఇసుక లోడింగ్, వే బిల్లులపై మైనింగ్ శాఖాధికారులను వివరణ అడుగగా లోడింగ్ నిలిచిపోయిన విషయం తమకు తెలియదని నిర్వాహకులతో చర్చించి ఉచిత ఇసుక లోడింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామంటూ మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ పేర్కొన్నారు.

ప్రతి గ్రామంలోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

చుండూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి గ్రామంలోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని దీంతో పాటు గోనె సంచులు కూడా తగినన్ని ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకుని నష్టపోవద్దని మండల వ్యవసాయాధికారి ఆదాంబాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా చుండూరు, మున్నంగివారిపాలెం గ్రామాలలో ఆయన మాట్లాడారు.

పల్నాడు వీరారాధన ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కోడిపోరు రసవత్తరంగా సాగింది. మాచర్ల వైపు అలనాడు నాగమ్మ, బ్రహ్మనాయుడు తమ రాజ్యాలను పణంగా పెట్టి కోడిపోరులో తలపడిన సంఘటనలను గుర్తుచేస్తూ నిర్వహించిన కోడిపోరు ఆద్యంతం ఆసక్తికరంగా ఉంది. మాచర్ల కోడి చిట్టిమల్లు, గురజాల కోడి శివంగిడేగలు తలపడ్డాయి. అంతకుముందు, వీరాచారవంతుల గ్రామోత్సవం, బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద కత్తిసేవ జరిగాయి.



కోడిపోరు

కారంపూడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు వీరారాధన ఉత్సవాల్లో నాలుగో రోజు మంగళవారం కోడిపోరు రసవత్తరంగా సాగింది. తొలుత పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారును మేళతాళాలతో ఇంటి వద్ద నుంచి ఊరేగింపుగా కోడిపోరు ప్రదేశానికి తీసుకొచ్చారు. నాయకురాలు నాగమ్మ వేషంను యాదవ వీరాచార వంతుడు కట్టాడు. బ్రహ్మనాయుడుగా పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు కూర్చున్నారు. మాచర్ల వైపు బ్రహ్మనాయుడు తరపున శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మనందరెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్, వినుకొండ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు నిలబడ్డారు. గురజాల వైపు నాయకురాలు నాగమ్మ తరపున పెదకూరపాడు శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ నిలబడ్డారు. మాచర్ల కోడి చిట్టిమల్లును బ్రహ్మనందరెడ్డి, గురజాల కోడి శివంగిడేగను రాము చేతబట్టారు. అనంతరం కోళ్లను పందేనికి ఉసిగొల్పారు.

◆ వీరారాధన ఉత్సవాల్లో నాలుగో రోజు
◆ మాచర్ల కోడితో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి
◆ గురజాల కోడితో గుడివాడ ఎమ్మెల్యే రాము


బ్రహ్మనాయుడు కోడి చిట్టిమల్లును చేబూనిన మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి




పందెం పుంజులతో ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, భాష్యం ప్రవీణ్




ఊరేగింపుగా వస్తున్న పీఠాధిపతి తరుణ్‌చెన్నకేశవ అయ్యవారు

నాగమ్మ కుట్ర..

అనాడు మాచర్ల రాజ్యాన్ని కైవసం చేసుకోవడానికి నాగమ్మ కుట్ర పన్ని కోడి పందేనికి బ్రహ్మనాయుడును ఉసిగొల్పుతుంది. జూద వ్యసనుడైన బ్రహ్మ నాయుడు ఈ పందేనికి సిద్ధమవుతాడు. తొలి, మలిపందెంలలో బ్రహ్మనాయుడు కోడి చిట్టి మల్లు గెలువగా, ముచ్చటగా మూడో పందెం వేద్దామని నాగమ్మ పట్టుబట్టింది. ఈ పందెంలో ఓడిన వారు పద్నాలుగేళ్లు రాజ్యాన్ని వదిలి అరణ్యవాసం చేయాలని నిబంధన పెట్టింది. నాగమ్మ నాడు నల్గొండ నుంచి తెప్పించిన శివంగి డేగ ఈ పందెంలో చిట్టిమల్లు ధాటికి తట్టుకోలేకపోతోంది. అప్పటికే గంగవరం కట్టుబోతుల వారిని పిలిపించిన నాగమ్మ మంత్రాక్షితలు చిట్టుమల్లుపై చల్లమని ఆదేశిస్తోంది. బ్రహ్మనాయుడు చూపు కోడిపై ఉన్నంత వరకు మంత్రాక్షితలు పనిచేయవని కట్టుబోతుల వారు చెబుతారు. ఆయన చూపు మరల్చడానికి నాగమ్మ తన చీరపై కుంకుడు బురుజు పోసుకొని బహిష్టయినట్లు నాటకం ఆడుతుంది. దీక్షా పరుడైన బ్రహ్మనాయుడు బహిష్టయిన వారి మొహం చూడకూడదని మొహం తిప్పుకుంటాడు. కట్టుబోతుల వారు బ్రహ్మనాయుడు కోడి అయిన చిట్టిమల్లుపై మంత్రాక్షితలు చల్లుతారు. దీంతో, చిట్టిమల్లు నేలకొరుగుతుంది. నాగమ్మ కోడి గెలిచినట్లు ప్రకటిస్తారు. బ్రహ్మనాయుడు అరణ్యవాసానికి వెళ్లాలని నిర్ణయిస్తారు. ఈ పోరు తిలకించడానికి వచ్చిన ప్రజలు ఆసనాలుగా ఉపయోగించిన రాళ్లు ఇప్పటికీ రెంటచింతల మండలం పాలువాయి వద్ద గుట్టలుగా ఉన్నాయి.



కొణతాల ఊరేగింపు

వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీరాచారవంతులు తమ పూర్వీకుల ఆయుధాలకు గంగధార మడుగులో స్నానమాచరింపజేసి అలంకరించి చెన్నకేశవ, అంకాళమ్మ ఆలయాల్లో తీర్థం స్వీకరించి గ్రామోత్సవం జరిపారు. బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద కత్తిసేవ చేశారు. పీఠాధిపతితో కోడిపోరు సంఘటనా స్థలానికి వీరాచారవంతులు తమ కొణతములతో వచ్చి నిలబడ్డారు. ఈ కార్యక్రమంలో వీరాచార పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, చప్పిడి రాము, మండల మాజీ అధ్యక్షుడు బొల్నేడి శ్రీనివాసరావు, బీసీ సెల్ నేత గోరంట్ల నాగేశ్వరరావు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీరాచారవంతులు పాల్గొన్నారు.

గుంటూరు రైల్వే డివిజన్‌లో నేటి నుంచి గుర్తింపు సంఘాల ఎన్నికలు

గుంటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ వ్యాప్తంగా బుధవారం నుంచి గుర్తింపు సంఘాల ఎన్నికలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ నెల 4, 5, 6 తేదీల్లో రైల్వే శాఖ ఏర్పాటు చేసిన కార్యాలయాల్లో ఎన్నికలు జరుగుతాయి. సుమారు 4 వేల మందికి పైగా ఉద్యోగులు ఓటుహక్కుని వినియోగించుకోనున్నారు. కాగా ఈ మూడు రోజుల్లో ఆన్‌డ్యూటీలో ఉండే సిబ్బంది కోసం పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించారు. గుర్తింపు కోసం మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘాలు తీవ్రంగా పోటీ పడుతున్నాయి. ఇప్పటికే రెండు యూనియన్‌లకు చెందిన రాష్ట్ర, జాతీయ నేతలు గుంటూరుకు వచ్చి ప్రచారం కూడా నిర్వహించారు. ఎన్నికల్లో తమను గెలిపిస్తే ఉద్యోగులకు సంబంధించిన దీర్ఘకాలిక డిమాండ్‌లను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీలు గుప్పించారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు ఏ యూనియన్ వైపు మొగ్గుచూపుతారో ఓట్ల లెక్కింపు జరిగే రోజున తేలి పోనుంది.

రేషన్ దందా..
రూ.32 కోట్లు



(5వ పేజీ తరువాయి)

ప్రజలు భావించారు. అయితే అప్పటి లాగానే బియ్యం నల్లబజారుకు తరలిపోతోంది. నాడు ప్రతిపక్షంలో విమర్శలు చేసిన నేతలు నోరు మెదపకపోవడం, కొన్ని దగ్గర్ల వారే రేషన్ మాఫియాకు అండగా ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. అక్రమార్కులు పోటీ పడిన ప్రాంతాల్లో బియ్యానికి ఎక్కువ ధర లభిస్తున్నట్లు సమాచారం. ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా పల్నాడు, గుంటూరు జిల్లాల్లో తనిఖీలు చేసి వందలాది క్వింటాళ్ల బియ్యం నిల్వలను గుర్తించారు. ఈ కేసులను అధికారులు నీరుగార్చారన్న విమర్శలున్నాయి. 6(ఏ) కేసులతో చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలున్నాయి. బియ్యం నిల్వలు స్వాధీనం చేసుకున్న మిల్లుల విద్యుత్ బిల్లులు.. ధాన్యం కొనుగోలు రికార్డులు పరిశీలిస్తే అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉన్నా ఈ దిశగా అధికారులు స్పందించలేదని విమర్శలున్నాయి. మంత్రి నాదెండ్ల మనోహర్ గుర్తించిన బియ్యం నిల్వల విషయంలోనే అధికారులు మొక్కుబడి చర్యలు తీసుకోవడంతో బ్లాక్ మార్కెట్‌కు అడ్డంకి లేకుండా పోయిందన్న వాదన ఉంది. నరసరావుపేట మండలం ములకలూరులో రెవెన్యూ అధికారులు ఓ డీలరు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఉండాల్సి నిల్వ కన్నా అధికంగా బియ్యం నిల్వలు ఉన్నట్టు గుర్తించారు. ఇదేలా సాధ్యమని అధికారులు లోతుగా పరిశీలిస్తే బియ్యం నిల్వలు డీలర్ వద్దకు చేరిన వెంటనే కార్డుదారులకు నగదు బదిలీ చేసి వేలిముద్రలు తీసుకున్నట్లు తేలింది. ఇటీవల తెలంగాణ రాష్ట్ర పరిధిలోని నల్గొండ పోలీసులు 500 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోగా వాటి మూలాలు బాపట్లలో ఉన్నాయనేది విచారణలో తేలింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలల వ్యవధిలోనే రేషన్ మాఫియా అక్రమార్కులపై బాపట్ల జిల్లాలో 48 వరకు 6ఏ కేసులు నమోదు చేశారు. అయితే ఇవన్నీ మొక్కుబడి కేసులు తప్పితే వీటివల్ల అక్రమార్కులు భయపడే పరిస్థితే లేదు. గత ప్రభుత్వంలో విజయకృష్ణన్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు రేషన్ మాఫియాలో కీలకంగా వ్యవహరిస్తున్న ముగ్గురిపై పీడీ యాక్టు ప్రతిపాదనలను ఎస్పీ కార్యాలయానికి పంపగా రాజకీయ ఒత్తిళ్లతో ఆ ప్రతిపాదనలకు సమాధి కట్టారు తప్పితే ఇప్పటికీ ఆచరణ దాల్చలేదు.

అధికారులపై ఒత్తిళ్లు.. దాడులు

బియ్యం అక్రమ వ్యాపారం, బియ్యం రీసైక్లింగ్ జరిగే మిల్లుల చిరునామాలతో సహా సమాచారం ఉన్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడరు. కొందరు అధికారులు అక్రమార్కులకు సహకరిస్తున్నా కొందరు అధికారులు బియ్యం బ్లాక్ మార్కెట్‌పై స్పందించి తనఖీలు నిర్వహించినా చర్యలు తీసుకునే పరిస్థితి లేదు. బ్లాక్ మార్కెట్ చేస్తోంది అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కావడంతో అధికారులు మిన్నకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. మండలం, నియోజకవర్గం గంపగుత్తగా మాట్లాడుకుని నిర్దీత మొత్తం కీలక నాయకుడికి చెల్లించేలా రేషన్ దందా నడుస్తోంది. అడపాదడపా దాడులకు వెళ్లిన అధికారులపై ఒత్తిళ్లు తెస్తుండగా మాట వినని వారిపై ఎదురుదాడికి దిగుతున్నారు. కొన్ని రోజుల క్రితం నిజాంపట్నం పరిధిలో బియ్యం నిల్వలు ఉన్నాయనే సమాచారంతో అధికారులు తనిఖీలకు వెళ్లగా వారిని నిలువరించే సాహసానికి అధికారపార్టీ ద్వితీయశ్రేణి నేతాగణం చేసిందంటే రేషన్ దందా ఆగడాలు ఏ విధంగా శృతిమించాయో అర్థమవుతోంది. అద్దంకి నియోజకవర్గ పరిధిలో ఈ మాఫియాకు కర్త, కర్మ, క్రియ అంతా అమాత్యుల అనుచరగణమేనన్న విమర్శలున్నాయి. ఇక్కడ తనిఖీలకు వెళ్లిన అధికారులకు వాహనాలను అడ్డుపెట్టి గతంలో విచ్చలవిడితనం ప్రదర్శించారు. బాపట్లలో ప్రారంభంలో రేషన్ మాఫియా ఆగడాలను అరికట్టడంపై అధికారులకు స్వేచ్ఛ ఇచ్చినా తర్వాత ఇక్కడ కూడా తిలాపాపం తలా పిడికెడు అన్న చందానే తయారైంది. పర్చూరు నియోజకవర్గంలో రేషన్ దందా వైసీపీ హయాంలో ఓ వెలుగు వెలిగింది. గత ప్రభుత్వంలో ఈ ఒక్క నియోజకవర్గ పరిధిలోనే 200 వరకు 6ఏ కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వేమూరు, చీరాలలో సైతం రేషన్ దందా వర్ధిల్లుతూనే ఉంది.

గతంలో వైసీపీ.. ఇప్పుడు కూటమి..

వైసీపీ హయాంలో పెద్దఎత్తున బియ్యం బ్లాక్ జరిగింది. అదే వరవడిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అక్రమార్కులు కొనసాగిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం పేదల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు పూర్తిగా నిరోధిస్తుందని ప్రజలు భావించారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా బియ్యం బ్లాక్ మార్కెట్‌ను నిరోధించలేక పోవడంతో ప్రజల్లో పాలకులపై నమ్మకం సన్నగిల్లుతోంది. తెనాలికి చెందిన నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్నారు. ఆయన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలసి కాకినాడ పోర్టులో తనిఖీలు నిర్వహించి వేలాది టన్నుల బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఇదే తరహాలో ఉమ్మడి జిల్లాలో రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముడుపులతో మౌనం..

బియ్యం అక్రమ వ్యాపారంలో నెల నెలా రూ.కోట్లల్లో ముడుపులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలున్నాయి. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో రెండు మూడు నియోజకవర్గాలు మినహా అన్ని చోట్ల అధికార పార్టీ నేతలు అక్రమార్కుల నుంచి ముడుపులు తీసుకుంటున్నట్లు పార్టీ వర్గాల ప్రచారం. ఒక చోట బియ్యం అక్రమ వ్యాపారం నిర్వహణకు నెలకు రూ.27 లక్షలు చెల్లిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరి కొన్ని చోట్ల నెలకు రూ.20 లక్షల వరకు చేతులు మారుతున్నట్లు సమాచారం. కొన్ని శాఖల అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఒక శాఖలోని కొందరు అధికారులకు ఒక్కొక్క చోట నెలకు రూ.2.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. మరో శాఖకు సంబంధించి నెలకు ఒక్కొక్క చోట నెలకు రూ.50 వేల వరకు ఇస్తున్నారని ప్రచారం.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ని సీసీఐ కేంద్రాల్లో (కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా)నిత్యం ఏదో ఒక సమస్య ఉంటూనే ఉంది. తాజాగా సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసిన పత్తి జిన్నింగ్ మిల్లుల్లో విత్తనాల నిల్వ లు పేరుకు పోవటం పెద్ద సమస్య గా పరిణమించింది. సీసీఐ జిన్నింగ్ ప్రక్రియ ఆరంభించిన తర్వాత చాలా మిల్లుల్లో విత్తనాలు అమ్మక పోవటం తో రోజు వారీ ఉత్పత్తి కార్యకలాపాలు స్తంభించి పోయాయి.దీని ప్రభావం వల్ల కొన్ని కేంద్రాల్లో కొనుగోలు కు తాత్కాలికం గా బ్రేక్ పడింది.

సీసీఐ కేంద్రాల్లో
విత్తనాల గోల

■ మిల్లుల్లో పేరుకుపోయిన 73100 క్వింటాళ్ల నిల్వలు
■ జిన్నింగ్ ప్రక్రియకు తీవ్ర ఆటంకం
■ ధర పెంచటంతో కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు
■ కాటన్ అసోసియేషన్ లేఖతో స్పందించిన సీఎండీ

గుంటూరు సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేసిన పత్తిని వెంటనే జిన్నింగ్ చేస్తారు. ఈ పద్ధతిలో ప్రతి రోజు వచ్చిన దూదిని బేళ్లగా మార్చి గోడౌన్ కు పంపుతారు. విత్తనాలను మాత్రం ఏ రోజుకి ఆ రోజు విక్రయిస్తారు. విత్తనాలు విక్రయించే ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. సీసీఐ చెప్పిన ధరకు ఆయిల్ మిల్లర్లు బిడ్లు వేసి కొనుగోలు చేస్తారు. ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలోని 30 కేంద్రాల్లో వచ్చిన విత్తనాలను అమ్మకానికి పెట్టారు. ధర అధికంగా ఉండటంతో మిల్లర్లు కొనుగోలు కు ముందుకు రాలేదు.డిసెంబరు 2 వరకు పత్తి విత్తనాలు క్వింటాల్ ధర రూ. 2950 గా ఉంచారు.

అక్కడ తక్కువ ధర..

వాస్తవానికి పత్తి ఎక్కువ దిగుబడికి అవకాశం ఉన్న తెలంగాణలో విత్తనాల నాణ్యత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. తేమ శాతం కూడా తక్కువగా ఉంటుంది. ఆంధ్రాలో ఆ పరిస్థితి లేదు. ఇక్కడి వాతావరణ పరిస్థితుల బట్టి విత్తనాలు తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. ఆ ఉద్దేశ్యం తోనే ఆంధ్రాలోని సీసీఐ కేంద్రాల్లోని పత్తి విత్తనాల ధరలు, తెలంగాణ కంటే తక్కువగా ఉండాలని ఏపీ కాటన్ అసోసియేషన్ ఈ ఏడాది జూలైలో హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో స్పష్టం చేసింది. ఆ సదస్సులో పాల్గొన్న సీసీఐ ఉన్నత అధికారులు అందుకు అంగీకరించినట్లు సమాచారం. కానీ సీజన్ ఆరంభం అయ్యాక మాత్రం అందుకు విరుద్ధంగా ధరలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆంధ్రాలో విత్తనాల ధరలు, తెలంగాణలో కంటే క్వింటాల్‌కు రూ. 100 వరకు తక్కువగా ఉండటంతో ఆయిల్ మిల్లర్లు అక్కడి నిల్వలు ఖాళీ చేశారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 30 సెంటర్లలో విత్తనాల నిల్వలు ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోయాయి.



సీసీఐ కేంద్రాల్లో పేరుకుపోయిన పత్తి విత్తనాల నిల్వలు

ఒక్కో సెంటరులో వేల క్వింటాళ్లు..

సీజన్ ఆరంభం అయ్యాక ఇక్కడి విత్తనాల ధర క్వింటాల్ కు రూ. 2950 గా నిర్ణయించారు. దాంతో ప్రతి రోజు జిన్నింగ్ వల్ల వచ్చిన విత్తనాలు నిల్వ లు నిలిచిపోయాయి. ఒక్కొక్క సెంటర్ లో 5100 క్వింటాల్ల వరకు కూడా విత్తనాల నిల్వ లు ఉన్నాయి.ఉమ్మడి జిల్లాలోని అన్ని సెంటర్లలో 73100 క్వింటాళ్ల విత్తనాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మిల్లుల్లో ఖాళీ లేక జిన్నింగ్ కు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో కాటన్ అసోషియేషన్ నేతలు సీసీఐ సీఎండీ కి మంగళవారం లేఖ రాశారు.దానిపై స్పందించిన సీఎండీ విత్తనాల ధరలను తగ్గించాలని అధికారులను ఆదేశించారు. పత్తి విత్తనాలు క్వింటాల్ ధర రూ . 2950 నుంచి తగ్గించి రూ. 2850 గా నిర్ణయించారు. ధర తగ్గగానే ఆయిల్ మిల్లర్లు విత్తనాలు కొనుగోలు ముందుకు వచ్చారు.సీసీఐ కి నగదు చెల్లింపు జరిగీన వెంటనే విత్తనాలు మిల్లుల నుండి బయటకు వెళ్లే అవకాశం ఉంది.

అమరావతికి నవకళ

(5వ పేజీ తరువాయి)


నాడు అమరావతి రాజధానికి శంకుస్థాపన జరిగిన ప్రదేశం (ఫైల్)

వాకింగ్ ట్రాకులు, సైక్లింగ్ ట్రాకుల నిర్మాణానికి రూ.3,859.66 కోట్లు కేటాయించారు. రాజధాని గ్రామాలను జోన్లుగా విడదీసి వాటిని అభివృద్ధి చేయనున్నారు. జోన్- 1ఏ కింద నెక్కల్లులో 1390.1 ఎకరాలు, జోన్- 1బీ కింద నెక్కల్లు, శాఖమూరులో 760.27 కోట్లు, జోన్- 2ఏ కింద అనంతవరం, నెక్కల్లు, నేలపాడు, శాఖమూరు, తుళ్లూరులో 1,223.76 ఎకరాలు, జోన్- 2 బీ కింద అవే గ్రామాల్లోని మరో 862.8 ఎకరాలు, జోన్- 5బీ కింద అబ్బరాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, రాయపూడి గ్రామాల్లోని 1,788.42 ఎకరాలు, జోన్- 5డీ కింద అబ్బరాజుపాలెం, తుళ్లూరు, రాయపూడి గ్రామాల్లోని 1,488.81 ఎకరాలు, జోన్-6 కింద కొండమరాజుపాలెం, రాయపూడి గ్రామాల్లోని 981.72 ఎకరాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రధాన రహదారుల పనులకు రూ.2,498 కోట్లు, పాలవాగు, కొండవీటి వాగు, గ్రావిటేషన్ కాల్వ అభివృద్ధి, రిజర్వాయర్ల నిర్మాణానికి రూ.1,585 కోట్లు కేటాయించారు. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన రాజధాని పనులను ప్రారంభించడంతో పాటు రైతుల ప్లాట్ల అభివృద్ధికి దాదాపు 4వేల కోట్లు కేటాయించడంపై రాజధానివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాము కలలుగన్న రాజధాని అభివృద్ధి చెందడంతోపాటు, తమకు కేటాయించిన ప్లాట్లు తమకు దక్కబోతున్నాయని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు



చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో రాజధాని అమరావతికి మళ్లీ ప్రాణం వచ్చింది. చంద్రబాబు చొరవ, కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో అమరావతికి మహర్దశ వచ్చింది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాజధాని పునర్నిర్మాణం చేపట్టిన చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- బత్తుల కోటేశ్వరరావు, ఉద్దండరాయునిపాలెం

భారీగా నిధుల కేటాయింపు



కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధాని పనులు మొదలు పెట్టారు. రైతుల ఆశలు, ఆకాంక్షలను గుర్తించి వారి ప్లాట్ల అభివృద్ధికి భారీ మొత్తంలో నిధులు కేటాయించారు. రైతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు చూపుతున్న ఔదార్యం మరిచిపోలేనిది. చంద్రబాబును రాజధాని రైతులు ఎప్పటికీ మరిచిపోరు. ఆయనకు రైతులంతా రుణపడి ఉంటారు. **- లంకా సుధాకర్, వెంకటపాలెం.**

ఉత్కంఠగా
ఎడ్ల బండలాగుడు పోటీలు

● జూనియర్స్ విభాగంలో హైదరాబాద్ ఎడ్లజత ప్రథమం
● నేడు సీనియర్స్ విభాగంలో పోటీలు


ప్రథమస్థానంలో నిలిచిన హైదరాబాద్ ఎడ్లజత

కారంపూడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని స్థానికంగా మంగళవారం జూనియర్స్ విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎడ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 4503 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే రోహన్‌బాబుకే చెందిన మరో ఎడ్లజత 4430.05 అడుగులతో రెండో స్థానం, ప్రకాశం జిల్లా బురుజుపల్లెకు చెందిన అత్తోట శిరీషాచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్లజత 4400 అడుగులతో మూడో స్థానం, కర్ణాటక రాష్ట్రం పాల్కందొడ్డికి చెందిన ఖాజాహుస్సేన్ ఎడ్లజత 4200 అడుగులతో నాలుగోస్థానం, బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన శిరీషాచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్లజత 4000 అడుగులతో ఐదోస్థానం, గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యలం సాంబశివరావు ఎడ్లజత 3901 అడుగులతో ఆరోస్థానంలో నిలిచాయి. బుధవారం సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలు వ్యాఖ్యాతలుగా సూరపునేని రాధాకృష్ణ, గూడ శ్రీనివాసరావులు వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విల్లాస్ నిర్మాణ సామగ్రి రోడ్డుపై నిల్వ చేయడంతో ఢీకొట్టిన బైక్

మరో యువకుడికి బలంగా, మరో బైక్‌పై ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలు

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైందని కుటుంబ సభ్యుల ఆవేదన

వేటపాలెం/చీరాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : టీనేజీ నిండలేదు.. కానీ నిండు నూరేళ్లు నిండాయి. విహారం కాస్తా విషాదంగా ముగిసింది. తప్పు ఎవరిదైనా ఆ కుటుంబానికి పూడ్చలేని నష్టం జరిగింది. వివరాల్లోకి వెళితే.. వేటపాలెం మండలం నాయినిపల్లికి చెందిన ఎర్రవరపు కల్యాణ్‌రామ్, సర్వోదయ కాలనీకి చెందిన కంచర్ల మనోజ్, వేటపాలేనికి చెందిన ఏ కోటేశ్వరరావు, కే వెంకటేష్‌లు సోమవారం పొట్టిసుబ్బయ్యపాలెం సముద్రతీరానికి రెండు బైక్‌లపై వెళ్లారు. రాత్రికి తిరిగి వచ్చే సమయంలో పొట్టిసుబ్బయ్యపాలెం దాటిన తరువాత క్రిస్టల్ సీఫుడ్స్ కంపెనీ సమీపంలో నిర్మిస్తున్న విల్లాస్ ముందు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. విల్లాస్ నిర్మాణానికి సంబంధించిన సిమెంట్, కంకరు కువ్వ రోడ్డు పైన పోసి ఉంది. కల్యాణ్‌రామ్, మనోజ్‌లు వస్తున్న బైక్ కంకరు కువ్వపైకి ఎక్కి అదుపుతప్పింది. దీంతో కల్యాణ్‌రామ్(19) ఎగిరి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మనోజ్ కాలికి తీవ్ర గాయమైంది. వెనుకనే వస్తున్న కోటేశ్వరరావు, వెంకటేష్ కూడా కింద పడి స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి వచ్చి మృతదేహంతో సహా, క్షతగాత్రులను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.



విషణ్ణ వదనాలతో కుటుంబ సభ్యులు

ఆ కష్టం ఎవరికీ రాకూడదు

కల్యాణ్‌రామ్ కుటుంబ సభ్యులు ఏరియా వైద్యశాలకు వచ్చారు. కల్యాణ్‌రామ్ తండ్రి ఎనిమిదేళ్ల కిందట గుండెపోటుతో మృతి చెందారు. చెల్లెలకు ఇటీవల వివాహమైంది. తల్లి రాజ్యలక్ష్మి, నాయనమ్మ ఆదిలక్ష్మితో ఉంటాడు. ఐటీఐ చదివిన కొడుకు చేతికందొస్తున్నాడు.. తమ కష్టాలు తీరుతాయని భావించిన వారిపై విధి పగబట్టింది. ఇక మాకు దిక్కెవరంటూ నాయనమ్మ వెక్కి వెక్కి ఏడుస్తుండడం అందర్నీ కలచివేసింది. మృతుని కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పరామర్శించారు. విల్లాస్ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డుపై వదిలేసిన సిమెంట్, కంకరు కువ్వపైకి బైక్ ఎక్కి అదుపుతప్పి పడిపోవడంతో అతను చనిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు.





ఘటనను పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు(ఇన్‌సెట్లో) కల్యాణ్‌రామ్ (ఫైల్)

నేర వార్తలు

గంజాయిని తరలిస్తున్న ఐదుగురు అరెస్టు

166 గ్రాముల సరుకు స్వాధీనం

టంగుటూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : గంజాయిని తరలిస్తున్న ఐదుగురిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద 166 గ్రాముల సరుకును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు కథనం మేరకు.. టంగుటూరు టోల్‌ప్లాజా సమీపంలో మంగళవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ఐదుగురు లారీ దిగి వెళ్లడం కనిపించింది. వారిని ఆపి ప్రశ్నించగా రకరకాల సమాధానాలు చెప్పారు. అనుమానంతో తనిఖీ చేయగా గంజాయి దొరికింది. ఐదుగురినీ అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

ఐదు మద్యం బాటిళ్లు స్వాధీనం

టంగుటూరులోకి ప్రవేశించే సర్వీసు రోడ్డు ఫ్లైఓవర్ వద్ద ఎస్సై నాగమల్లేశ్వరరావు తనిఖీలు చేస్తుండగా స్థానిక వెస్ట్ పోతుల చెంచయ్య కాలనీకి చెందిన షేక్ మౌలాలి ఐదు మద్యం బాటిళ్లతో పట్టుబడ్డాడు. వాటిని స్వాధీనం చేసుకొని అతనిని అరెస్టు చేశారు.

కుక్కల దాడిలో గాయపడిన గొర్రెపిల్లలకు చికిత్స



గాయపడిన గొర్రెపిల్లలను పరిశీలిస్తున్న పశువైద్యుడు ప్రతాప్‌రెడ్డి

సంతనూతలపాడు, డిసెంబరు 3: చిలకపాడులో పాలపర్తి రాంబాబుకు చెందిన గొర్రెలదొడ్డిలో ఆదివారం అర్ధరాత్రి వీధి కుక్కల దాడిలో గాయపడిన గొర్రెపిల్లలకు పశువైద్యశాఖ అధికారి డాక్టర్ ప్రతాప్ ఎరెడ్డి మంగళవారం వైద్యసేవలు అందించారు. గొర్రెల దొడ్డికి ఎత్తైన గోడను లేదా ఇనుప చువ్వల కంచెను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గొర్రెపిల్లల మృతితో నష్టపోయిన వారికి పరిహారం అందేలా ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. కాగా చిలకపాడులో వీధికుక్కల దాడిలో చనిపోయిన గొర్రెపిల్లలకు నష్టపరిహారం అందించాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం కార్యదర్శి కిలారి పెద్దబ్బాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గాయపడ్డ గొర్రెపిల్లలను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, ఎ.శేషారావు పాల్గొన్నారు.

రేషన్‌షాపులపై 6ఏ కేసులు

నాగులుప్పలపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామంలోని 29, 30 నంబర్లు గల రేషన్‌దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. 29వ షాపులో 85 బస్తాలు, 30వ షాపులో 25 బస్తాలు రేషన్ బియ్యం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు. సదరు రేషన్‌షాపు డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేశారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఫిరోజ్‌బాషా, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణవంశీ పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

మద్దిపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి మహి ఆగ్రోస్ సమీపంలో స్కూటీ అదుపుతప్పి మహిళకు గాయాలయ్యాయి. మంగళవారం మార్టూరుకు చెందిన మహాలక్ష్మి తన స్కూటీపై ఒంగోలులో ఒక శుభకార్యానికి హాజరై తిరిగి వెళుతుండగా లారీ వేగంగా రావడంతో ఆమె భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో స్కూటీ అదుపు తప్పి కిందపడటంతో ఆమెకు గాయాలు కాగా అనంతరం ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

5,6 తేదీల్లో పాలిటెక్నిక్ ఫెస్ట్

ఒంగోలు విద్య, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5,6వతేదీల్లో రీజనల్ పాలిటెక్నిక్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాంఘిక, సంక్షేమశాఖమంత్రి డీఎస్‌బీవీ.స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియాతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ, వలంటీర్లకు ఉపాధి కూలి

ప్రజావేదికలో వెలుగుచూసిన అక్రమాలు

డ్వామా పీడీ విజయలక్ష్మి

యద్దనపూడి/మార్టూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు, వలంటీర్లకు కూడా ఉపాధి కూలి చెల్లింపులు జరిగాయని డ్వామా పీడీ ఏవీ విజయలక్ష్మి తెలిపారు. వారంరోజుల నుంచి ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనులపై గ్రామాలలో ప్రత్యేక బృందాలు సామాజిక తనిఖీ చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో షేక్ మహమ్మద్ ఖలీబ్ జావెద్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న పీడీ విజయలక్ష్మి ఉపాధి పథకంలో జరిగిన అక్రమాలను వివరించారు. వీటిని సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయని ఆమె వెల్లడించారు. ఉపాధి పనులలో అంగన్‌వాడీ కార్యకర్త, వలంటీర్లకు హాజరు వేసి కూలి డబ్బులు చెల్లించారన్నారు. యద్దనపూడి మండలం పోలూరులో ఇద్దరు వలంటీర్లు, గన్నవరంలో అంగన్‌వాడీ కార్యకర్త, వలంటీర్ ఉన్నట్లు గుర్తించారు. బాధ్యుల నుంచి రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. మరికొన్ని గ్రామాలలో కూడా పనికి రాకుండా హాజరువేయించుకొని ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించారన్నారు. మండలంలోని గ్రామాలలో జరిగిన అవకతవక పనులకు సంబంధించి రూ.21లక్షలను సంబంధిత ఉద్యోగుల నుంచి రికవరీ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ.3లక్షలు మాత్రమే రికవరీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీడీ కోటయ్యానాయక్, ఎస్ఆర్‌పీ వెంకటేష్ నాయక్, ఏపీవో రమేష్, వివిధ గ్రామాల టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



సామాజికతనిఖీలో పాల్గొన్న డ్వామా పీడీ విజయలక్ష్మి

భూ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలి

- కలెక్టర్ అన్సారియా ఆదేశం
- వీడియో కాన్ఫరెన్స్‌కు గైర్హాజరైన ఇరువురు సర్వేయర్లకు షోకాజ్‌లు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూకబ్జాలు, ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. రెవెన్యూకు సంబంధించిన గ్రీవెన్స్, పత్రికా కథనాలతో పాటు సుమోటోగా ఆయా అంశాలను చేపట్టి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, అసైన్డ్ భూములు కబ్జా, ఆక్రమణలకు సంబంధించి వస్తున్న ఫిర్యాదులను పరిశీలించాలని చెప్పారు. ఆ భూముల స్వభావాన్ని బట్టి బాధ్యులకు చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి వాటిని కాపాడాలన్నారు. కేవలం నోటీసులు ఇచ్చి సరిపెట్టుకోకుండా, ఆ సమస్యను సహేతకంగా పరిష్కారం చూపాలని సూచించారు. కుటుంబ సమస్యలను భూకబ్జాలుగా చూపి రెవెన్యూ సమస్యలుగా పేర్కొనవద్దన్నారు. ఈ నెలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నందున ఇప్పటికే నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ చేసి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సర్వేయర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పనిచేయాలన్నారు. కాగా వీడియో కాన్ఫరెన్స్‌కు గైర్హాజరైన వెలిగండ్ల, పుల్లలచెరువు సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఆర్వో చినఓబులేషును కలెక్టర్ ఆదేశించారు. కోర్టు కేసులకు సంబంధించిన వకాలత్, పునఃసమీక్ష, తదితర పిటీషన్లను సకాలంలో దాఖలు చేయాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ రేషన్ డీలర్ల ఖాళీలను త్వరగా భర్తీ చేస్తామని చెప్పారు. రేషన్ కార్డులు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో అదనపు దుకాణాల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను వెంటనే పంపించాలని ఆదేశించారు. జిల్లా నుంచి వెళ్తున్న హైవే నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

రేషన్ దందా.. రూ.32 కోట్లు

(5వ పేజీ తరువాయి)

ప్రజలు భావించారు. అయితే అప్పటి లాగానే బియ్యం నల్లబజారుకు తరలిపోతోంది. నాడు ప్రతిపక్షంలో విమర్శలు చేసిన నేతలు నోరు మెదపకపోవడం, కొన్ని దగ్గర్ల వారే రేషన్ మాఫియాకు అండగా ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. అక్రమార్కులు పోటీపడిన ప్రాంతాల్లో బియ్యానికి ఎక్కువ ధర లభిస్తున్నట్లు సమాచారం. ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా పల్నాడు, గుంటూరు జిల్లాల్లో తనిఖీలు చేసి వందలాది క్వింటాళ్ల బియ్యం నిల్వలను గుర్తించారు. ఈ కేసులను అధికారులు నీరుగార్చారన్న విమర్శలున్నాయి. 6(ఏ) కేసులతో చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలున్నాయి. బియ్యం నిల్వలు స్వాధీనం చేసుకున్న మిల్లుల విద్యుత్ బిల్లులు.. ధాన్యం కొనుగోలు రికార్డులు పరిశీలిస్తే అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉన్నా ఈ దిశగా అధికారులు స్పందించలేదని విమర్శలున్నాయి. మంత్రి నాదెండ్ల మనోహర్ గుర్తించిన బియ్యం నిల్వల విషయంలోనే అధికారులు మొక్కుబడి చర్యలు తీసుకోవడంతో బ్లాక్ మార్కెట్‌కు అడ్డంకి లేకుండా పోయిందన్న వాదన ఉంది. నరసరావుపేట మండలం ములకలూరులో రెవెన్యూ అధికారులు ఓ డీలరు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఉండాల్సి నిల్వ కన్నా అధికంగా బియ్యం నిల్వలు ఉన్నట్టు గుర్తించారు. ఇదేలా సాధ్యమని అధికారులు లోతుగా పరిశీలిస్తే బియ్యం నిల్వలు డీలర్ వద్దకు చేరిన వెంటనే కార్డుదారులకు నగదు బదిలీ చేసి వేలిముద్రలు తీసుకున్నట్లు తేలింది. ఇటీవల తెలంగాణ రాష్ట్ర పరిధిలోని నల్గొండ పోలీసులు 500 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోగా వాటి మూలాలు బాపట్లలో ఉన్నాయనేది విచారణలో తేలింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలల వ్యవధిలోనే రేషన్ మాఫియా అక్రమార్కులపై బాపట్ల జిల్లాలో 48 వరకు 6ఏ కేసులు నమోదు చేశారు. అయితే ఇవన్నీ మొక్కుబడి కేసులు తప్పితే వీటివల్ల అక్రమార్కులు భయపడే పరిస్థితే లేదు. గత ప్రభుత్వంలో విజయకృష్ణన్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు రేషన్ మాఫియాలో కీలకంగా వ్యవహరిస్తున్న ముగ్గురిపై పీడీ యాక్టు ప్రతిపాదనలను ఎస్పీ కార్యాలయానికి పంపగా రాజకీయ ఒత్తిళ్లతో ఆ ప్రతిపాదనలకు సమాధి కట్టారు తప్పితే ఇప్పటికీ ఆచరణ దాల్చలేదు.

అధికారులపై ఒత్తిళ్లు.. దాడులు

బియ్యం అక్రమ వ్యాపారం, బియ్యం రీసైక్లింగ్ జరిగే మిల్లుల చిరునామాలతో సహా సమాచారం ఉన్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడరు. కొందరు అధికారులు అక్రమార్కులకు సహకరిస్తున్నా కొందరు అధికారులు బియ్యం బ్లాక్ మార్కెట్‌పై స్పందించి తనఖీలు నిర్వహించినా చర్యలు తీసుకునే పరిస్థితి లేదు. బ్లాక్ మార్కెట్ చేస్తోంది అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కావడంతో అధికారులు మిన్నకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. మండలం, నియోజకవర్గం గంపగుత్తగా మాట్లాడుకుని నిర్ణీత మొత్తం కీలక నాయకుడికి చెల్లించేలా రేషన్ దందా నడుస్తోంది. అడపాదడపా దాడులకు వెళ్లిన అధికారులపై ఒత్తిళ్లు తెస్తుండగా మాట వినని వారిపై ఎదురుదాడికి దిగుతున్నారు. కొన్ని రోజుల క్రితం నిజాంపట్నం పరిధిలో బియ్యం నిల్వలు ఉన్నాయనే సమాచారంతో అధికారులు తనిఖీలకు వెళ్లగా వారిని నిలువరించే సాహసానికి అధికారపార్టీ ద్వితీయశ్రేణి నేతాగణం చేసిందంటే రేషన్ దందా ఆగడాలు ఏ విధంగా శృతిమించాయో అర్థమవుతోంది. అద్దంకి నియోజకవర్గ పరిధిలో ఈ మాఫియాకు కర్త, కర్మ, క్రియ అంతా అమాత్యుల అనుచరగణమేనన్న విమర్శలున్నాయి. ఇక్కడ తనిఖీలకు వెళ్లిన అధికారులకు వాహనాలను అడ్డు పెట్టి గతంలో విచ్చలవిడితనం ప్రదర్శించారు. బాపట్లలో ప్రారంభంలో రేషన్ మాఫియా ఆగడాలను అరికట్టడంపై అధికారులకు స్వేచ్ఛ ఇచ్చినా తర్వాత ఇక్కడ కూడా తిలాపాపం తలా పిడికెడు అన్న చందానే తయారైంది. పర్చూరు నియోజకవర్గంలో రేషన్ దందా వైసీపీ హయాంలో ఓ వెలుగు వెలిగింది. గత ప్రభుత్వంలో ఈ ఒక్క నియోజకవర్గ పరిధిలోనే 200 వరకు 6ఏ కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వేమూరు, చీరాలలో సైతం రేషన్ దందా వర్ధిల్లుతూనే ఉంది.

గతంలో వైసీపీ.. ఇప్పుడు కూటమి..

వైసీపీ హయాంలో పెద్దఎత్తున బియ్యం బ్లాక్ జరిగింది. అదే వరవడిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అక్రమార్కులు కొనసాగిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం పేదల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు పూర్తిగా నిరోధిస్తుందని ప్రజలు భావించారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా బియ్యం బ్లాక్ మార్కెట్‌ను నిరోధించలేక పోవడంతో ప్రజల్లో పాలకులపై నమ్మకం సన్నగిల్లుతోంది. తెనాలికి చెందిన నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్నారు. ఆయన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలసి కాకినాడ పోర్టులో తనిఖీలు నిర్వహించి వేలాది టన్నుల బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఇదే తరహాలో ఉమ్మడి జిల్లాలో రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముడుపులతో మౌనం..

బియ్యం అక్రమ వ్యాపారంలో నెల నెలా రూ.కోట్లల్లో ముడుపులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలున్నాయి. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో రెండు మూడు నియోజకవర్గాలు మినహా అన్ని చోట్ల అధికార పార్టీ నేతలు అక్రమార్కుల నుంచి ముడుపులు తీసుకుంటున్నట్లు పార్టీ వర్గాల ప్రచారం. ఒక చోట బియ్యం అక్రమ వ్యాపారం నిర్వహణకు నెలకు రూ.27 లక్షలు చెల్లిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరి కొన్ని చోట్ల నెలకు రూ.20 లక్షల వరకు చేతులు మారుతున్నట్లు సమాచారం. కొన్ని శాఖల అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఒక శాఖలోని కొందరు అధికారులకు ఒక్కొక్క చోట నెలకు రూ.2.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. మరో శాఖకు సంబంధించి నెలకు ఒక్కొక్క చోట నెలకు రూ.50 వేల వరకు ఇస్తున్నారని ప్రచారం.

అమరావతికి నవకళ

(5వ పేజీ తరువాయి)

వాకింగ్ ట్రాకులు, సైక్లింగ్ ట్రాకుల నిర్మాణానికి రూ.3,859.66 కోట్లు కేటాయించారు. రాజధాని గ్రామాలను జోన్లుగా విడదీసి వాటిని అభివృద్ధి చేయనున్నారు. జోన్- 1ఏ కింద నెక్కల్లులో 1390.1 ఎకరాలు, జోన్- 1బీ కింద నెక్కల్లు, శాఖమూరులో 760.27 కోట్లు, జోన్- 2ఏ కింద అనంతవరం, నెక్కల్లు, నేలపాడు, శాఖమూరు, తుళ్లూరులో 1,223.76 ఎకరాలు, జోన్- 2 బీ కింద అవే గ్రామాల్లోని మరో 862.8 ఎకరాలు, జోన్- 5బీ కింద అబ్బరాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, రాయపూడి గ్రామాల్లోని 1,788.42 ఎకరాలు, జోన్- 5డీ కింద అబ్బరాజుపాలెం, తుళ్లూరు, రాయపూడి గ్రామాల్లోని 1,488.81 ఎకరాలు, జోన్-6 కింద కొండమరాజుపాలెం, రాయపూడి గ్రామాల్లోని 981.72 ఎకరాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రధాన రహదారుల పనులకు రూ.2,498 కోట్లు, పాలవాగు, కొండవీటి వాగు, గ్రావిటేషన్ కాల్వ అభివృద్ధి, రిజర్వాయర్ల నిర్మాణానికి రూ.1,585 కోట్లు కేటాయించారు. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన రాజధాని పనులను ప్రారంభించడంతో పాటు రైతుల ప్లాట్ల అభివృద్ధికి దాదాపు 4వేల కోట్లు కేటాయించడంపై రాజధానివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాము కలలుగన్న రాజధాని అభివృద్ధి చెందడంతోపాటు, తమకు కేటాయించిన ప్లాట్లు తమకు దక్కబోతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు



చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో రాజధాని అమరావతికి మళ్లీ ప్రాణం వచ్చింది. చంద్రబాబు చొరవ, కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో అమరావతికి మహర్దశ వచ్చింది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాజధాని పునర్నిర్మాణం చేపట్టిన చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- బత్తుల కోటేశ్వరరావు, ఉద్దండరాయునిపాలెం

భారీగా నిధుల కేటాయింపు



కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధాని పనులు మొదలు పెట్టారు. రైతుల ఆశలు, ఆకాంక్షలను గుర్తించి వారి ప్లాట్ల అభివృద్ధికి భారీ మొత్తంలో నిధులు కేటాయించారు. రైతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు చూపుతున్న ఔదార్యం మరిచిపోలేనిది. చంద్రబాబును రాజధాని రైతులు ఎప్పటికీ మరిచిపోరు. ఆయనకు రైతులంతా రుణపడి ఉంటారు.

- లంకా సుధాకర్, వెంకటపాలెం

అవీఇవీ

పారిశ్రామిక అభివృద్ధికి సహకరించాలి

ఏపీఐఐసీ చైర్మన్ రామరాజుతో ఎమ్మెల్యే ఏలూరి భేటీ



ఏపీఐఐసీ చైర్మన్‌తో ఎమ్మెల్యే ఏలూరి, పక్కనే దామచర్ల సత్య

పర్చూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ మంతెన రామరాజుతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు. మంగళవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో కలసి ఎమ్మెల్యే ఏలూరి పర్చూరు నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తున్న క్రమంలో పర్చూరు నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి సహకరించాలని కోరారు. నియోజకవర్గం వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం కల్పించాలన్నారు. దీనిపై స్పందించిన రామరాజు తనవంతు కృషిచేస్తానని చెప్పారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల తేదీల్లో మార్పులు

- 7 నుంచి ప్రారంభం

సంతనూతలపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో ఈనెల 5వ తేదీ నుంచి జరగనున్న 71వ ఆంధ్ర సీనియర్స్ పురుషులు, మహిళల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల నిర్వహణ తేదీల్లో స్వల్ప మార్పులు జరిగినట్లు నిర్వాహకులు నూదనగుంట క్రిష్ణమూర్తి, కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ కుర్రా భాస్కరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో తేదీల మార్పు జరిగిందన్నారు. ఈ పోటీలను ఈనెల 7నుంచి 10వ తేదీ వరకు జరుగతాయని, పోటీలను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభిస్తారని వారు పేర్కొన్నారు.

పన్ను చెల్లించని గృహాలకు కొళాయి తొలగింపు



పన్ను చెల్లించని గృహానికి కొళాయి కట్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో దీర్ఘకాలికంగా పన్నులు బకాయి ఉన్న గృహాలకు తాగునీటి కొళాయిలను తొలగించారు. కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు రెవెన్యూ, సచివాలయ, ఇంజనీరింగ్ సిబ్బంది వేర్వేరు బృందాలుగా నగరంలోని పలు డివిజన్లలో పర్యటించారు. ఈ మేరకు వారు ముందుగా పన్ను బకాయిలు చెల్లించాలని సమాచారం అందించడంతోపాటు కొంత గడువు ఇచ్చారు. అయితే కొందరు పన్నులు చెల్లించకపోవడంతో తాగునీటి సరఫరా నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అధిక మొత్తంలో ఉన్నవారు తప్పనిసరిగా పన్నులు చెల్లించాలన్నారు. అలాగే రూ.3వేలకు మించి పైన బకాయిలు ఉన్న ప్రతి ఒక్కరూ కచ్చితంగా చెల్లించాలని కోరారు. కొళాయి తొలగించిన తర్వాత కూడా పన్నులు చెల్లించకుంటే శాఖపరంగా రెడ్ నోటీసులు అందజేసి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకు సంబంధించి కార్పొరేషన్ కార్యాలయంలో పన్నుల చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని, సెలవు రోజుల్లో కూడా పన్నులు చెల్లించవచ్చని కమిషనర్ తెలిపారు.

జాతీయ, పండుగ సెలవులు ఇలా...



మాట్లాడుతున్న సహాయ కమిషనర్ శ్రీనివాసకుమార్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు జాతీయ, పండుగ రోజుల్లో వేతనంతో కూడిన సెలవులను ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు. గుంటూరులోని కార్మికశాఖ కార్యాలయంలో మంగళవారం కార్మికశాఖ సంయుక్త కమిషనర్ ఎస్.శ్రీనివాసకుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యజమానులు, వర్తక సంఘాలు, కార్మిక సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. జాతీయ పండుగలు 5, పండుగ దినాలు 4గా నిర్ణయంచారు. జాతీయ పండుగలు జనవరి 26న గణతంత్ర దినోత్సవం, మే 1న కార్మిక దినోత్సవం, ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, అక్టోబరు 2న గాంధీజయంతి, నవంబరు 1న ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం, ఇక పండుగ దినాలు జనవరి 15న కనుమ, మార్చి 31న రంజాన్, ఆగస్టు 27న వినాయకచవితి, డిసెంబరు 25న క్రిస్మస్ పండుగలకు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని నిర్ణయించారు. అనంతరం శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ యజమానులు విధిగా తమ దుకాణాలను రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయించుకోవాలన్నారు. వారి వద్ద పనిచేసే కార్మికులకు కార్మిక సంక్షేమ నిధిని కట్టాలని చెప్పారు. ఉపకార్మిక కమిషనర్ గాయిత్రీదేవి, సహాయ కమిషనర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

జేసీని కలిసిన రెవెన్యూ అసోసియేషన్



జేసీ గోపాలకృష్ణకు బొకే ఇస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు మంగళవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఇటీవల ఎన్నికైన కలెక్టరేట్ యూనిట్ నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ నాయకులు పిన్నిక మధుసూదన్ ఈ సందర్భంగా జేసీకి పరిచయంచేశారు. కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు బి.సత్యసాయి శ్రీనివాసరావు, కార్యదర్శి బి.రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

7లోపు రీకౌంటింగ్‌కు ఫీజు చెల్లించాలి : డీఈవో

ఒంగోలు విద్య, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డీఈఎల్ఈడీ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ(2018-20) పరీక్ష ఫలితాలపై ఏమైనా అనుమానాలు ఉంటే ఈనెల 7వతేదీ లోపు రీకౌంటింగ్ కోసం ఫీజు చెల్లించాలని డీఈవో కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డమ్మీ మార్కుల జాబితాలు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. రీకౌంటంగ్‌కు సబ్జెక్టుకు రూ.500 చొప్పున సీఎఫ్ఎంఎస్ ద్వారా చలానా తీసి డమ్మీ మార్కుల జాబితాను జతచేసి సెల్ఫ్ అడ్రసు కవర్‌తో నేరుగా అందజేయాలని ఆయన కోరారు.

ముగ్గురు ఎస్ఐలకు స్థాన చలనం

ఒంగోలు(క్రైం)డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముగ్గురు ఎస్ఐలకు స్థానచలనం కల్పిస్తూ ఎస్పీ ఏఆర్.దామోదర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న బి.మహేంద్రను జరుగుమల్లికి, అక్కడ పనిచేస్తున్న యు.పున్నారావును ఒంగోలు టూటౌన్‌కు బదిలీ చేశారు. ఇక ఒంగోలు టూటౌన్‌లో పనిచేస్తున్న ఎం.శివనాంచారయ్యను వీఆర్‌కు పంపించారు.

మత్తు పదార్థాలతో యువత భవిత చిత్తు

ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

చీరాలటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలు, వివిధ రకాల మత్తు పదార్థాలకు బానిసలైన యువత భవిష్యత్ చిత్తవుతుందని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గౌతమి డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యసనాలకు బానిసలుగా మారితే జీవితాలు నాశనమవుతాయన్నారు. యువత అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. నియంత్రణకు యువత చేయి కలపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీహరి కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వాడరేవు గ్రామంలో దాడులు నిర్వహించారు. ఒకరిని అదుపులోకి తీసుకొని 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఏబీసీపై బ్రిడ్జికి పొంచి ఉన్న ప్రమాదం

- పరిమితికి మించి బరువు ఉన్న గ్రానైట్ రాయితో రవాణా
- ఆందోళనలో ప్రయాణికులు, రైతులు

బల్లికురవ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో దశాబ్దాల కిందట అద్దంకి బ్రాంచి కాలువపై నిర్మించిన బ్రిడ్జికి ఇప్పుడు ప్రమాదం పొంచి ఉంది. బల్లికురవ మండల పరిధిలోని వల్లాపల్లి సమీపంలో ఉన్న ఏబీసీ కాలువ 33వ మైలు వద్ద కాలువపై ఉన్న బ్రిడ్జిపై గుండా ప్రతి రోజు గ్రానైట్ ముడిరాయిని పరిమితికి లారీలలో రవాణా చేస్తున్నారు. బ్రిడ్జిపైకి లారీలు రాగానే వెనక ముందు ఉన్న ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. కొండల మాదిరిగా ఉన్న బండరాళ్లను ఒక్కో లారీపై రెండు మూడు వేసి తరలిస్తున్నారు. బల్లికురవ మండల పరిధిలో ఉన్న వీర్లకొండ వద్ద గల క్వారీల నుంచి మేదరమేట్ల గుళ్లాపల్లి, ఒంగోలు తదితర ప్రాంతాలకు ముడి రాయి రవాణా పెద్ద ఎత్తున జరుగుతోంది. బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని, పెద్ద రాళ్ల లారీలు వెళుతుంటే ఏ సమయంలో ఏం ప్రమాదం జరుగుతుందోనని భయమేస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. లారీలపైకి సుమారు వంద టన్నుల బరువు ఉన్న



వల్లాపల్లి సమీపంలో ఉన్న బ్రిడ్జిపై పరిమితికి మించిన లోడుతో వెళ్తున్న గ్రానైట్ లారీ

రాళ్లను తీసుకు వెళుతున్నారని అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని ఈ బ్రిడ్జి కూలి పోతే అద్దంకి బల్లికురవ రోడ్డు రాకపోకలు పూర్తిగా స్తంభించి పోతాయని వారు తెలిపారు. ఏబీసీలో నీటి సరఫరాకు కూడా అంతరాయం కలిగే ప్రమాదం పొంచి ఉందని రైతులు అంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే పరిమితికి మించి రవాణా చేస్తున్న వాహనాలను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



తూటుకాడతో నిండి ఉన్న కుందేరు

తూటుకాడతో నిండిన కుందేరు

- సక్రమంగా సాగని పారుదల
- భూగర్భ జలాలు రంగుమారుతున్నాయని ప్రజల ఆందోళన

కొత్తపేట(చీరాల), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చీరాల, కొత్తపేట మధ్య ఉన్న కుందేరు తూటుకాడతో నిండిపోయింది. దీంతో పారుదల సక్రమంగా సాగడం లేదు. ఈ క్రమంలో తమకు భూగర్భ జలాలు రంగుమారుతున్నాయని, నీరు కలుషితమవుతున్నాయని కుందేరు ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. కొంత మేర కలుషిత నీటితో చర్మ వ్యాధులకు కూడా కొందరికి వస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

8న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమావేశం

మార్టూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం ఈ నెల8వ తేదీ ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు సంఘం జిల్లా కన్వీనర్ షేక్ తాజ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రకాశం, బాపట్ల జిల్లాకు చెందినవారు హాజరు కావాలని కోరారు.

పంగులూరులో కోతుల బెడద

పంగులూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులో కోతుల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గుంపులుగా తిరుగుతూ బీభత్సం సృష్టిస్తున్న కోతులు సోమ, మంగళవారాలలో గ్రామంలో పది మందికి పైగా గాయపరిచాయి. వీధుల్లో సంచరిస్తూ, ఇళ్లలోకి చొరబడుతున్న కోతులను తోలేందుకు ప్రయత్నించిన పలువురు మహిళలను గాయపరిచాయి. కోతుల గుంపులను బయటకు పంపి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు అధికారులను వేడుకుంటున్నారు.

బడ్డీకొట్టు నిర్వాహకుడిపై ముగ్గురు దాడి

ఈపూరుపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బడ్డీ కొట్టు నిర్వాహకుడిపై ముగ్గురు దాడిచేసి గాయపరిచారు. ఈఘటన సోమవారం రాత్రి ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలేరమ్మ గుడి వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోరంట్ల చంద్రాయుడు బడ్డీ కొట్టు నడుపుకుంటున్నాడు. ఈక్రమంలో రాత్రి సమయంలో కొనుగోలు చేసేందుకు వచ్చిన ముగ్గురు యువకులు అతనితో గొడవపడి దాడిచేసి గాయ పరిచారు. బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందాడు. ఈమేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారం భించారు.

రెండు ఆటోలు ఢీకొని పలువురికి గాయాలు

కుక్కను తప్పించబోయి ప్రమాదం

ఈపూరుపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కుక్కను తప్పించబోయిన ఆటో డ్రైవర్ మరో ఆటోను ఢీకొట్టాడు. దీంతో రెండు ఆటోలలో ఉన్న పలువురు గాయపడ్డారు. అందిన వివరాల మేరకు.. మంగళవారం మధ్యాహ్నం ఈపూరుపాలెం మీసేవా కేంద్రం ఎదురుగా ఆటో డ్రైవర్ కుక్కను తప్పించబోయి ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీకొన్నాడు. దీంతో రెండు ఆటోలలో ఉన్న నరసాయపాలెంకు చెందిన వృద్ధురాలు, ఈపూరుపాలెంకు చెందిన నసీమూన్, భాగ్యలక్ష్మి, మరో వృద్ధురాలికి గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న ఈపూరుపాలెం రైటర్ కొమ్మనబోయిన శ్రీనివాసరావు, మహిళా పోలీస్ క్షతగాత్రులను 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈమేరకు కేసు నమోదైంది.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



సిబ్బందితో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

అద్దంకి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్‌లో లక్ష ఇళ్ల గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వ లక్ష్యం పెట్టుకున్న నేపథ్యంలో అద్దంకి పట్టణంలో 75 ఇళ్ల గృహ ప్రవేశాలు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. అనంతరం కమిషనర్, ఏఈ కిరణ్ నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు.

అద్దంకిటౌన్ : ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో సింగయ్య సూచించారు. మంగళవారం మండలంలోని కలవకూరు సచివాయం పరిధిలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను హౌసింగ్ ఏఈ కిరణ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సక్రమంగా పనిచేయని ఫిల్టర్ బెడ్‌లు

- పాత ఇసుకను మార్చి కొత్తది నింపాలి
- అపరిశుభ్రమైన నీటి సరఫరాపై ప్రజల ఆందోళన

మార్టూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు రక్షిత మంచి నీటి పథకంలో రెండు ఫిల్టర్ బెడ్స్‌లో ఇసుకను తక్షణమే మార్చాల్సిన అవసరం ఉంది. గ్రామానికి చెరువు నుంచి విడుదల చేసే తాగునీరు ఫిల్టర్‌బెడ్‌లో సక్రమంగా ఫిల్టర్ కాకపోవడంతో అపరిశుభ్రంగా సరఫరా అవుతున్నాయి. దీంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ పాలనలో రూ.5 లక్షలకు పైగా వ్యయంతో ఫిల్టర్ బెడ్‌లలో ఇసుక మార్చి శుభ్రం చేసినప్పటికీ నాసిరకమైన ఇసుకను వినియోగించడంతో అది నిరుపయోగమైంది. ప్రస్తుతం ఆ ఇసుకను తొలగించి నాణ్యమైన ఇసుకను వేసి మంచి నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం వానలు కురుస్తుండడంతో ఇసుకను పూర్తిస్థాయిలో మార్చడానికి అవకాశం లేదని పంచాయతీ సిబ్బంది చెప్తున్నారు. 25వేల జనాభా కలిగిన మర్టూరు గ్రామ పంచాయతీలో తాగునీటి సరఫరాలో గ్రామ పంచాయతీ పకడ్బందీగా చర్యలు తీసుకోవలసిన అవసరమున్న నేపథ్యంలో ఫిల్టర్ బెడ్స్‌ను శుభ్రంచేసి మంచినీటిని సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఫిల్టర్ బెడ్లకు వినియోగించే ఇసుక నాణ్యమైనదిగా ఉండడంతోపాటు పాత ఇసుకను పంచాయతీ సక్రమంగా విని యోగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఫిల్టర్ బెడ్‌ను శుభ్రం చేస్తున్న కార్మికులు (ఫైల్)



బస్సు మరమ్మతుకు గురికావడంతో రోడ్డుపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు

కాలం చెల్లిన ఆర్టీసీ బస్సు

- నడిరోడ్డుపై ఆగిన వాహనం
- ప్రయాణికులకు ఇక్కట్లు

పర్చూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులతోపాటు డ్రైవర్లు కూడా ఇబ్బందులు పడుతున్నారు. గమ్యస్థానాలకు వెళ్లే క్రమంలో బస్సు ఎక్కడ ఆగిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడుతోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాల పరిధిలో తరచూ ఎక్కడో ఒకచోట బస్సులు మరమ్మతులకు గురై మార్గమధ్యంలో నిలిచిపోతున్నాయి. ఊళ్లకు చేరుకోలేక ప్రయాణికులు నానా పాట్లు పడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. మంగళవారం పర్చూరు - చీరాల రోడ్డులోని జీవీఎం కళాశాల సమీపంలో మరమ్మతులకు గురై బస్సు రోడ్డుపైనే ఆగిపోయింది. మరో వాహనం కోసం ప్రయాణికులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. కాలంచెల్లిన బస్సుల స్థానంలో కొత్త వాహనాలను సమకూర్చాలని ప్రజలు కోరుతున్నారు.

భూసార పరీక్షల ఆధారంగా సాగు చేయాలి

సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మృధుల

పంగులూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షల ఆధారంగానే పంట సాగు చేపట్టాలని బాపట్ల ఉప్పునీటి పరిశోధనా సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మృధుల అన్నారు. మండలంలోని జనకవరం, కొండమూరు గ్రామాలలో మంగళవారం జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం ఉష మాట్లాడుతూ శనగ సాగులో విత్తన శుద్ధి ప్రాధాన్యత, తెగుళ్ల, పురుగుల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలన్నారు. ఏవో సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొండమూరు సర్పంచ్ బండి శివకుమారి, కాటా అంజయ్య, జనకవరం గ్రామ టీడీపీ అధ్యక్షుడు బాచిన హరిబాబు, గుర్రం వెంకటరావు, వ్యవసాయ సహాయకులు దినేష్, నవనీతం, రైతులు పాల్గొన్నారు.

కొత్తపేట : రైతులు ప్రతి ఒక్కరు తాము సాగు చేసిన పంటలకు బీమా చేయించుకోవాలని ఏవో కాశీవిశ్వనాథ్, వ్యవసాయశాఖ అధికారులు చెప్పారు. మంగళవారం రైతులతో సమీక్ష నిర్వహించారు. పంట బీమా ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

పర్చూరు : ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.మోహనరావు అన్నారు. మంగళవారం మండలంలోని దేవరపల్లి, ఇనగల్లు గ్రామాల్లో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్, : ఈ-పంట నమోదు ద్వారా ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం వెంకటాపురం, విప్పర్లవారిపాలెం పొలాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ గ్రామాల సర్పంచ్‌లు పాకనాటి అంజిరెడ్డి, బోనిగల శాంతమ్మ, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న వీఏఏ సీత పాల్గొన్నారు.

చీరాలటౌన్ : రైతులు రబీలో సాగు చేసే పంటను ఆర్‌ఎస్‌కెలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుమతి పేర్కొన్నారు. మంగళవారం చీరాల మండల పరిధిలోని బోయినవారి పాలెం, తోటవారి పాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బీమాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏలు ఎస్‌కె ఆసిఫా, సిహెచ్ ప్రసన్నకుమారి, మరియు జడ్‌బిఎన్‌ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వర్షాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ : గ్రామాలలో రెండు రోజుల నుంచి చెదురుమదురు వర్షాలు కురుస్తున్నాయని, బోరు బావుల కింద వరి సాగు చేసిన రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి కుమారి పేర్కొన్నారు. మండలంలోని గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాలలో వర్షాల వలన పడిపోయిన వరి పంటను ఏవో మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా కుమారి మాట్లాడుతూ రైతులు వర్షాలు తగ్గే వరకు వరి పంట కోత కోయవద్దని తెలిపారు. రైతులు పంటలకు ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. అంబడిపూడి, బల్లికురవ గ్రామాలలో ఉన్న కామన్ సర్వీసు సెంటర్లలలో వరి పంటకు ఎకరాకు రూ.126, మొక్కజొన్నకు రూ.105 చొప్పున ఈనెల 15వ తేదీలోపు రైతులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో వంశీ, వీఏఏలు వెంకటేశ్వర్లు, ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

వర్షం.. పంటలకు అనుకూలం

సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

పంగులూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా మండలంలో మంగళవారం రెండు గంటల పాటు వర్షం కురిసింది. పంగులూరు పరిసర గ్రామాలలో రోడ్లు జలమయమయ్యాయి. ఈ వర్షం సాగులో ఉన్నవి, సాగుకు సిద్ధంగా ఉన్న పంటలకు ఉపకరిస్తుందని వ్యవసాయాధికారి డీ సుబ్బారెడ్డి అన్నారు. ఉదయం ఏడున్నర గంటల నుంచి 10 గంటల వరకు రెండు సెంటీ మీటర్లకు పైగా వర్షం కురిసింది. మండలంలో 800 హెక్టార్లలో మొక్కజొన్న, 1100 ఎకరాలలో వరి, 2,200 ఎకరాలలో పొగాకు, 900 ఎకరాలలో శనగ, 350 ఎకరాలలో మిరప సాగులో ఉండగా, మరో 2వేల ఎకరాలలో మొక్కజొన్న, రెండు వేల ఎకరాలలో పొగాకు, వెయ్యి ఎకరాలలో శనగ సాగు చేపట్టే అవకాశం ఉందని ఏవో తెలిపారు.

ఇంకొల్లు : మండల కేంద్రం ఇంకొల్లులో మంగళవారం భారీ వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు నీటితో నిండాయి. గంగవరం, ఇంకొల్లు, పూసపాడు, హనుమోజిపాలెం గ్రామాలలో భారీగా పడింది.



పంగులూరు ప్రధాన కూడలిలో నిలిచిన వాన నీరు

నీరు నిలువ కుండా చూసుకోండి

మేదరమెట్ల : అల్పపీడనంతో కురుస్తున్న వర్షపు నీటిని పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని ఏవో శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం రావినూతల, కుర్రవానిపాలెం గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగ, పొగాకు తోటల్లో నీరు నిలిస్తే దెబ్బ తింటుందన్నారు. కార్యక్రమంలో పశు సంవర్థక శాఖకు చెందిన వీ. వెంకటేశ్వర్లు, మా ర్కెట్ కమిటీ రత్నం, వీఏఏలు రాకేష్, మౌనిక, వీహెచ్ఏ రాణి పాల్గొన్నారు.



డాక్టర్ బాలరాజేశ్వరికి వినతిపత్రం అందిస్తున్న ఆశాలు

ఏఎన్ఎంపై చర్యలకు ఆశాల డిమాండ్

పంగులూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో వేధింపులకు గురిచేస్తూ తన ఇంటిలో పనిచేయాలని ఆశాను ఒత్తిడి చేస్తున్న ఏఎన్ఎంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. మండలంలోని కొండమంజులూరు సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న జయమ్మ అదే గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త కొలకలూరి బేబీ పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, దుర్భాషలాడుతూ దాడికి పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవల్సిందిగా కోరుతూ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాలరాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఆమెతోపాటు పలువురు ఆశాకార్యకర్తలు ఉన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

అద్దంకి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో భూసమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5వ తేదీ నుంచి రెవన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. 5వ తేదీన కలవకూరు, 6న మణికేశ్వరం, 10న వెంపరాల, 11న మైలవరం, 12న చ క్రాయపాలెం, 13న గోపాలపురం, 17న ధేనువకొండ, 19న మోదేపల్లి, 21న కుంకుపాడు, 24న తిమ్మాయపాలెం, 26న కొటికలపూడి, 28న బొమ్మనంపాడు, 31న చినకొత్తపల్లి, జనవరి 2, 3 తేదీలలో అద్దంకి పట్టణంలోని గాజులపాలెం సచివాలయం, 4న ధర్మవరం, 7న ఉప్పలపాడు, 8వ తేదీన గోపాలపురం (నరసింహపురం రెవెన్యూ)లో రెవెన్యూ గ్రామ సభలు జరుగుతాయని తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

చినగంజాం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు మంగళవారం తెలిపారు. 5వ తేదీన చినగంజాం, 11న పెదగంజాం గ్రామసచివాలయం-1, 14న సచివాలయం-2, 17న మోటుపల్లి, 20న సంతరావూరు, 27న చింతగుంపల్లి, జనవరి 3వ తేదిన గొనసపూడి, 8న కడవకుదురులో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయాల వద్ద ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో రైతులు సమస్యలపై అర్జీలు అందజేయాలని తహసీల్దార్ కోరారు.

దివ్యాంగులకు గౌరవం ఇవ్వాలి

అద్దంకిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ప్రతి ఒక్కరూ తమ వంతు సాయం అందించి వారి అభివృద్ధికి సాయ పడాలని ఎంఈవో బూదాటి సుధాకరరావు అన్నారు. మంగళవారం భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం వేదవతి, ఐఈఆర్‌టీలు శ్రీనివాస్, యోనా, పీఆర్పీ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, మండల న్యాయ అధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీ చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు.

బల్లికురవ : దివ్యాంగులకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఇవ్వాలని కొనిదెన ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేబీ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరిగింది. ఈసందర్భంగా ప్రభుత్వం ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అందిస్తున్న పథకాల గురించి అధికారులు వివరించారు. అనంతరం దివ్యాంగులు, వారి తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సరళకుమారి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రవీంద్రబాబు, గ్రామ పెద్దలు గాలం ప్రబాకరరావు, భవిత కేంద్రం ఐఈఆర్‌టీలు నాగబాబు, వెంకటేశ్వర్లు, నాజీని పాల్గొన్నారు.

పంగులూరు : దివ్యాంగుల అభ్యున్నతి కోసమే భవిత కేంద్రాలు కృషి చేస్తున్నాయని ఎంఈవో జి.వీరాంజనేయులు కోరారు. పంగులూరులోని భవిత కేంద్రంలో మంగళవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ 18ఏళ్ల లోపు విభిన్న ప్రతిభావంతుల పిల్లలందరికీ అందిస్తున్న ఫిజియోథెరపీ, అలవెన్సులు, ఉపకరణాలను వినియోగించుకోవాలని కోరారు. ఉన్నత విద్య చదివే వారికి ఎస్‌బీఐ ద్వారా విద్యా రుణం అందిస్తామని బ్యాంక్ మేనేజర్ జి.శ్రీనివాసరావు తెలిపారు.



పంగులూరులో బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

అనంతరం పోటీలను నిర్వహించి దివ్యాంగులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్ భాస్కరమూర్తి, ఐఈడీ ఆర్పీలు యోహాన్, అరుణ, హెచ్‌ఎం లలితకుమారి, దుర్గా ప్రసాద్, జోసఫ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విజేతలకు చెన్నుపాటి వసుంధరాదేవి బహుమతులను సమకూర్చారు.

మార్టూరు :ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం స్థానికంగా ఆర్‌జేఎస్‌టీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో వస్రాంనాయక్ పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పలుపోటీలలో విజేతలకు ఎంఈవో బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, నాగకుమారి, ఆయేషా ఫర్వీన్ పాల్గొన్నారు.

యద్దనపూడి : విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికితీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ప్రధానోపాధ్యాయులు యందేవేంద్రరావు అన్నారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం యద్దనపూడిలోని భవిత కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు దేవేంద్రరావు అధ్యక్షత వహించారు. అనంతరం వివిధ పోటీలలో చక్కని ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివపార్వతి, తేళ్ల సుబ్బారావు, రజని, రిసోర్స్ పర్సన్లు చిన్న కోటేశ్వరరావు, సురేఖ పాల్గొన్నారు.

చినగంజాం : విభిన్న ప్రతిభావంతులపై వివక్ష చూపకుండా, విద్యతోపాటు అన్నింటిలోనూ అవకాశాలను కల్పించాలని ఎంఈవో-2 కోటేశ్వరరావు అన్నారు. మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఐఈఆర్‌టీ టీ.బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి, విజేతలైన దివ్యాంగులకు ఎంఈవో, చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం. డి.రత్నకుమారి బహుమతులను అందజేశారు. భారత్ నిర్మాణ్ వలంటీర్ గోవిందస్వామి, టి.ముసలయ్యలు విద్యార్థులకు బిస్కెట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్.ఎం రసూల్ ఉన్నిసాబేగం, ఉపాధ్యాయులు నరసింహారావు, నాగార్జునరెడ్డి, ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయుడు కోటిరెడ్డి, ఐఈఆర్‌టీ డి.నాగార్జున, సీఆర్పీలు సురేంద్రకుమార్, ఆశీష్‌కుమార్, ఆయా రాజేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : భవిత కేంద్రంలో విభిన్నప్రతిభావంతులకు అందిస్తున్న సేవలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఎంఈవో శ్రీనివాసరావు సూచించారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు రవిబాబు, అనిత,ఫిజియోథెరపిస్ట్ పూజిత పాల్గొన్నారు.

చీరాలటౌన్ : మంగళవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఈపూరుపాలెంలో గల భవిత కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు, వీఆర్ ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ డా. రవికుమార్ విద్యార్థులకు పలు సూక్తులు బోధించి ఉత్సాహ పరిచారు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.